Bhavani Publication Trust

https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు

The people's Verdict

తెలుగు జాతీయ దినపత్రిక



PRAJA TELEVISION
The People's Favour

మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541

రిపోర్టర్లు కావలెను

అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన

ప్రజా టెలివిజన్

యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622

ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్,
లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్



సంపుటి : 26 | సంచిక : 145 | హైదరాబాద్ | శుక్రవారం 17 ఏప్రిల్ 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-

Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR


# బ్యారేజీల పునరుద్ధరణలో మాట రానివ్వొద్దు

## ఎన్డీఎస్ఏ మార్గదర్శకాల మేరకే చేయాలి: సీఎం.. మంత్రి ఉత్తమ్‌తో కలిసి అధికారులతో ఢిల్లీలో సమీక్ష





దిల్లీ: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను జాతీయ ఆనకట్టల భద్రత పర్యవేక్షక సంస్థ (ఎన్డీఎస్ఏ) మార్గదర్శకాల మేరకే చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. దిల్లీలో ఆయన గురువారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో కలిసి అధికారులు, ఇంజినీర్లతో బ్యారేజీల అంశంపై సమీక్ష నిర్వహించారు. బ్యారేజీల వద్ద పరీక్షలు, బోర్ల తవ్వకాలు, పనుల్లో వేగం పెంచే చర్యలు ఎంతవరకు వచ్చాయంటూ బ్యారేజీల పునరుద్ధరణ పనుల కోసం ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీ కన్వీనర్, కర్నల్ పరీక్షిత్ మెహ్రాను సీఎం ఆరా తీసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా మేడిగడ్డ బ్యారేజీ వద్ద బోర్ల తవ్వకాలు ఈ నెలాఖరులోగా పుంజుకుంటాయని పరీక్షిత్ వివరించినట్లు సమాచారం. దీంతో బ్యారేజీల పునరుద్ధరణలో వేగం పెంచాలని సీఎం సూచించారు. ఈ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున తాత్కాలిక పనులు చేయడం, వెయ్యి బోర్లు వేయాల్సిన చోట అరకొరగా వేసి వదిలేయడం వంటివి చేయవద్దని సీఎం అప్రమత్తం చేశారు. ప్రభుత్వానికి మాట రానివ్వద్దని సూచించారు. గత పాలకులు అలాగే చేశారని, అనేక రకాల తప్పులు చేయడం వల్లే ఈ రోజు బ్యారేజీలు పనికిరాకుండా పోయాయని పేర్కొన్నారు. అలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకుండా బ్యారేజీలను పకడ్బందీగా పునరుద్ధరించి వినియోగంలోకి తేవాలని సూచించినట్లు తెలిసింది. ఈ సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శులు ఇ.శ్రీధర్, సందీప్‌కుమార్ సుల్తానియా, మాణిక్ రాజ్, రామగుండం సీఈ శ్రీనివాస్ గుప్తా, ఇతర ఇంజినీర్లు పాల్గొన్నారు.



# మూడు రోజుల్లో మరింత ఎండలు

## బయటకు రాకండి

## వాతావరణ శాఖ హెచ్చరిక

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతు న్నాయి. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు దాటగా, రానున్న మూడు రోజుల్లో ఇవి మరో 1 నుంచి 2 డిగ్రీల మేర పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఎండలతో పాటు వడ గాలులు వీచే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్‌తో పాటు ఖమ్మం, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక లు జారీ అయ్యాయి. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 41 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామా బాద్, ఖమ్మం, నారాయణ పేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలులు వీయవచ్చు... ఈరోజు ఉమ్మడి ఆదిలా బాద్‌తో పాటు

- మిగతా 2వ పేజీలో



# మహిళా రిజర్వేషన్ల క్రెడిట్ ప్రతిపక్షాలకే

వారికే ఖాళీ చెక్కు ఇచ్చేస్తున్నాం..

హోర్డింగ్‌లపై విపక్ష నాయకుల ఫొటోలు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నాం

-2లో

రిజర్వేషన్ల అమలును మీరు వ్యతిరేకిస్తే మాకే రాజకీయ ప్రయోజనం

2029లో కూడా రిజర్వేషన్లు కల్పించకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు

పునర్విభజనలో ఏ ఒక్క రాష్ట్రంపైనా వివక్ష చూపే ప్రసక్తే లేదు

లోక్‌సభ స్థానాలలో ఏ మార్పు ఉండదు

లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టికరణ



గట్టి పునాదులతో ఉన్న బీఆర్ఎస్‌ను ఇంటికి పంపి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగిరేందుకు అష్టకష్టాలు పడ్డారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ప్రాధాన్యం లభిస్తుందని ఆశించారు. రెండున్నరేళ్లుగా నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. అధికార దాహం తీరని ద్వితీయ శ్రేణి నాయకులు ఇక మాకు పదవులు రావు అనే నైరాశ్యంలో మునిగిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు పరిపాలన, మరోవైపు జాతీయ స్థాయి రాజకీయాల్లో బిజీగా ఉండటంతో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయం కొలిక్కి రావడం లేదని అంటున్నారు.

# ఈసారైనా భర్తీ చేస్తారా?

## ఊరిస్తున్న నామినేటెడ్ పదవులు.. కొలిక్కి వచ్చినట్లు అధిష్ఠానం లీకులు

జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పార్టీ శ్రేణులు

తొలి విడతలో సుమారు 40 చైర్మన్ పోస్టులు

ఈసారి ప్రకటించకపోతే మరింత ఆగ్రహం

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

నామినేటెడ్ పదవుల భర్తీ కొలిక్కి వచ్చిందని తెలంగాణ ప్రభుత్వం లీక్‌లు ఇచ్చింది. అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటుతున్నా, కష్టపడిన కేడర్‌కు పదవుల పంపకం జరగకపోవడంతో పార్టీలో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. పార్టీ శ్రేణుల్లో పెరుగుతున్న అసహనాన్ని గుర్తించిన అధిష్టానం.. మరో రెండు రోజుల్లో కీలకమైన కార్పొరేషన్ పదవులను భర్తీ చేయాలని నిర్ణయించినట్లుగా మీడియాకు లీకులు ఇచ్చారు. నామినేటెడ్ పోస్టుల వ్యవహారంలో అధిష్ఠానంపై పార్టీ కేడర్ కాసింత గుర్రుగానే ఉంది. ఏళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న నేపథ్యంలో పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకువచ్చేందుకు కార్యకర్తలు అలుపెరగకుండా పని చేశారు. గట్టి పునాదులతో ఉన్న బీఆర్ఎస్‌ను ఇంటికి పంపి రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగిరేందుకు అష్టకష్టాలు పడ్డారు. పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తమకు ప్రాధాన్యం లభిస్తుందని ఆశించారు. రెండున్నరేళ్లుగా నామినేటెడ్ పదవుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు.

### గడువులే.. పదవులు లేవు..

రాష్ట్రంలో నామినేటెడ్ పదవులు విషయంలో పార్టీ అధిష్ఠానం నాన్చుడు ధోరణి అవలంభిస్తోంది. అదిగో.. ఇదిగో అనడం మినహా ప్రకటించడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వయంగా పీసీసీ మహేష్ కుమార్ గౌడ్ మార్చి 15 నాటికి ప్రక్రియ పూర్తవుతుంది అని ప్రకటించినప్పటికీ, అది ఆచరణలోకి రాలేదు. అధికార దాహం తీరని ద్వితీయ శ్రేణి నాయకులు ఇక మాకు పదవులు రావు అనే నైరాశ్యంలో మునిగిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒకవైపు పరిపాలన, మరోవైపు జాతీయ స్థాయి రాజకీయాల్లో బిజీగా ఉండటంతో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయం కొలిక్కి రావడం లేదని అంటున్నారు. సీఎం అనుమతి లేకుండా ప్రభుత్వపరంగా లబ్ధిజరిగే నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసే పరిస్థితి లేదు.

ఇప్పటికే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయ్యింది. ఇప్పటికీ నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయకపోతే ఎలా అన్న ప్రశ్న ఉదయిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ కోసం అహర్నిశలు శ్రమించిన నాయకులు.. ఇప్పుడు నామినేటెడ్

- మిగతా 2వ పేజీలో



# భారత్-పాకిస్థాన్ కంటే దారుణంగా ఏపీ-తెలంగాణ విభజన

## ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్య

## రేవంత్‌రెడ్డి హైబ్రిడ్ విధానం హాస్యాస్పదమని ఎద్దేవా

దిల్లీ: "గతంలో యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను ఏపీ, తెలంగాణగా ఎలా విభజించిందో అందరూ చూశారు. బ్రిటిష్

- మిగతా 2వ పేజీలో



# చాణక్యుడు బతికి ఉంటే.. బీజేపీ చాతుర్యానికి ఆశ్చర్యపోయేవాడు

## ఈ స్కీమ్ వెనుక అమిత్ షా ఉన్నారు

## లోక్‌సభలో కాంగ్రెస్ నేత ప్రియాంకా ధ్వజం

న్యూఢిల్లీ: చాణక్యుడు ఇప్పుడు గనుక బతికి ఉంటే బీజేపీ నాయకుల రాజకీయ చాతుర్యం చూసి ఆశ్చర్యపోయేవాడని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా అన్నారు. గురువారం మూడు బిల్లులపై జరిగిన చర్చలో ఆమె పాల్గొన్నారు. మోదీ ప్రభుత్వం మరోసారి ప్రజలను మోసం చేయాలని చూస్తోందని, దేశ సమగ్రతపై అతిపెద్ద దాడి ప్రారంభించిందని ఆరోపించారు. ఒకవైపు మహిళా రిజర్వేషన్ల గురించి మాట్లాడుతూనే మరోవైపు ఓబీసీల హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. చిన్న రాష్ట్రాల ప్రాబల్యాన్ని

- మిగతా 2వ పేజీలో



# తెలంగాణలో తారెత్తిస్తున్న ఎండలు

## ఆదిలాబాద్‌లో 43.8 డిగ్రీల నమోదు

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఎండలు తారెత్తిస్తున్నాయి. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 43.8 డిగ్రీలు, నిజామాబాద్ జిల్లాలో 42.7, మహబూబ్‌నగర్‌లో 42, రామగుండంలో 42 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్ర, శనివారాల్లోనూ ఉత్తర, దక్షిణ తెలంగాణలో ఎండల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ

- మిగతా 2వ పేజీలో




రామగుండం పరిధిలోని ఓ రేషన్ దుకాణంలో ఇటీవల నిబంధనల ప్రకారం ఓ లబ్ధిదారుడికి 72 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, తూకం వేసిన తర్వాత బయట చూస్తే అది కేవలం 68 కిలోలే తేలింది. అంటే ఒక్కో లావాదేవీపై ఏకంగా 4 కిలోల బియ్యాన్ని డీలర్లు నొక్కేస్తున్నారు.

# పేదల బియ్యం డీలర్ల పాలు!

## పెద్దపల్లి జిల్లాలో రేషన్ దోపిడీ.. తూకాల్లో భారీ మోసం

డిజిటల్ యంత్రాలతోనే మాయాజాలం

కార్డుకు 2 నుంచి 4 కిలోల కోత

నెలకు రూ.1.20 కోట్ల దోపిడీ?

కళ్లు మూసుకున్న పౌరసరఫరాల శాఖ

పెద్దపల్లి, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు): పేదల ఆకలి తీర్చాల్సిన 'అన్నం' గింజలు అక్రమార్కుల జేబుల్లోకి చేరుతున్నాయి. ప్రభుత్వ పంపిణీ వ్యవస్థ (పిడిఎఫ్)లో పారదర్శకత కోసం ప్రవేశపెట్టిన డిజిటల్ తూకం యంత్రాలే ఇప్పుడు మోసాలకు అడ్డాగా మారుతున్నాయి. పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా

- మిగతా 2వ పేజీలో

# మూడు రోజుల్లో మరింత ఎండలు

(మొదటి పేజీ తరువాయి)

నాగర్ కర్నూల్, వనపర్తి, నారా యణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని అంచనా. ఈ జిల్లాలకు 'ఎల్లో' హెచ్చరికలు జారీ చేశారు. మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవస రమైతే తప్ప బయటకు రాకూడదని నిపుణులు సూచిస్తున్నారు. తగినంత నీరు తాగుతూ ఉండాలని, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ విజ్ఞప్తి చేసింది.

# ఈసారైనా భర్తీ చేస్తారా?

(మొదటి పేజీ తరువాయి)

పోస్టులు కూడా దక్కకపోతే ఎలా అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రెండున్నరేళ్ల పాలన గడిచిపోయింది, మిగిలిన తక్కువ సమయంలో పదవులు దక్కించుకుని ఏం లాభం అన్న ఆవేదన వారిలో కనిపిస్తోంది. ఈ అసంతృప్తిని ఆసరాగా చేసుకుని విపక్షాలు కాంగ్రెస్ నాయకులకు గాలం వేసే ప్రమాదం ఉందని నిఘా వర్గాలు హెచ్చరించడంతోనే రేవంత్ రెడ్డి ఈ వేగవంతమైన నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

### 30 నుంచి 40 కార్పొరేషన్ చైర్మన్ పదవులు

తొలి విడతలో దాదాపు 30 నుంచి 40 కార్పొరేషన్ చైర్మన్ పదవులను భర్తీ చేసే అవకాశం ఉంది. ఇందులో సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేయాలని, ముఖ్యంగా మహిళలకు 20 శాతం వాటా ఇవ్వాలని సీఎం భావిస్తున్నారు. అయినప్పటికీ, పార్టీలోని సీనియర్లకు, జూనియర్లకు మధ్య సమతుల్యత సాధించడం రేవంత్ రెడ్డికి కత్తిమీద సాము లాంటిదే. ఒకరిని ప్రసన్నం చేస్తే మరొకరు అలిగే పరిస్థితి ఉండటంతో, జాబితా రూపకల్పనలో ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. కేడర్‌లో నమ్మకం కలగాలంటే ఈ సారి ప్రకటనలు కాకుండా నియామక ఉత్తర్వులు నేరుగా వెలువడాల్సి ఉంది.

# చాణక్యుడు బతికి ఉంటే.. బీజేపీ చాతుర్యానికి ఆశ్చర్యపోయేవాడు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రం వెల్లడించింది. ఆయా జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమేపీ 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపింది. మరోవైపు ఈ నెల 19 నుంచి 23 వరకు ఐదు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. దిగువస్థాయి గాలుల్లో మార్పు, క్యుములోనింబస్ మేఘాలు, ద్రోణి ప్రభావాలతో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. వడగండ్లు కూడా పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది.

# భారత్-పాకిస్థాన్ కంటే దారుణంగా ఏపీ-తెలంగాణ విభజన

(మొదటి పేజీ తరువాయి)

వాళ్లు చేసిన భారత్, పాకిస్థాన్ విభజనకంటే దారుణంగా చేశారు. అలాంటి వారసత్వం కాంగ్రెస్ సొంతం" అని భాజపా ఎంపీ తేజస్వీ సూర్య విమర్శించారు. ఆయన గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ బిల్లుపై మాట్లాడుతూ పై వ్యాఖ్య చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే ఇప్పుడు మహిళా రిజర్వేషన్లతో పాటు, నియోజకవర్గాల పునర్విభజన ప్రశాంతంగా చేయగలుగుతోందని మాట్లాడారు. దేశంలో నియోజకవర్గాల పునర్విభజనకు జనాభా, జీఎస్‌డీపీ హైబ్రిడ్ విధానాన్ని ప్రాతిపదికగా తీసుకోవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన డిమాండ్ అత్యంత హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. "బిహార్‌లోని సాధారణ ఓటరు ఓటు విలువ కంటే తెలంగాణలోని ఓటరు విలువ ఎక్కువగా ఉండాలని చెప్పడమంటే అది రాజ్యాంగం చెప్పిన ఒక ఓటు.. ఒకే విలువ అన్న సూత్రాన్ని ధ్వంసంచేసినట్లే. ఈ విధానం ద్వారా కాంగ్రెస్ వారు ధనవంతులకు ఎక్కువ ఓట్లు, పేదలకు తక్కువ ఓట్లు కావాలనుకుంటున్నారా? దీని ప్రకారం వెళ్తే ముఖేశ్‌అంబానీకి లక్ష ఓట్లు దక్కితే, పేదలకు ఒక్క ఓటు మాత్రమే ఉంటుంది. కాంగ్రెస్ విధానం ఇదేనా?అన్నది స్పష్టంచేయాలి. నియోజకవర్గాల పెంపును రాష్ట్రాల జీఎస్‌డీపీతో ముడిపెట్టడం అత్యంత తెలివితక్కువ వాదన. రాజ్యాంగ విరుద్ధం" అని విమర్శించారు.

# పేదల బియ్యం డీలర్ల పాలు!

(మొదటి పేజీ తరువాయి)

రేషన్ డీలర్లు సాగిస్తున్న ఈ 'డిజిటల్' దందాపై లబ్ధిదారులు నిప్పులు చెరుగుతున్నారు. ఒక్కో కార్డుపై కిలోల కొద్దీ కోత విధిస్తూ ఏటా కోట్ల రూపాయల ధనాన్ని అడ్డంగా దోచేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

### గుట్టు రట్టు.. తూకంలో తక్కువ!

రామగుండం పరిధిలోని ఓ రేషన్ దుకాణంలో ఇటీవల జరిగిన తనిఖీలు అక్రమాలకు అద్దం పడుతున్నాయి. నిబంధనల ప్రకారం ఓ లబ్ధిదారుడికి 72 కిలోల బియ్యం ఇవ్వాల్సి ఉండగా, తూకం వేసిన తర్వాత బయట చూస్తే అది కేవలం 68 కిలోలే తేలింది. అంటే ఒక్కో లావాదేవీపై ఏకంగా 4 కిలోల బియ్యాన్ని డీలర్లు నొక్కేస్తున్నారు. డిజిటల్ యంత్రాల సెట్టింగ్స్‌లో మార్పులు చేయడం లేదా బరువు తక్కువగా చూపించేలా సాంకేతిక 'మాయ' చేయడం ద్వారా ఈ దోపిడీ నిరంతరాయంగా సాగుతోంది. జిల్లాలోని రేషన్ కార్డుల సంఖ్యను బట్టి చూస్తే ఈ దోపిడీ అక్షరాలా కోట్లలో ఉందని గణాంకాలు చెబుతున్నాయి.

### మొత్తం కార్డులు: సుమారు 2 లక్షలు.

సగటు కోత: కార్డుకు 2 కిలోలు (కనీసం). నెలవారీ మాయం: 4 లక్షల కిలోల (400 టన్నులు) బియ్యం. ఆర్థిక నష్టం: బహిరంగ మార్కెట్ ధర (కిలో రూ. 30) ప్రకారం నెలకు రూ. 1.2 కోట్లు. ఏడాదికి: సుమారు రూ. 14.4 కోట్లకు పైగా లబ్ధిదారుల నోటి కాడి కూడు అపహరణకు గురవుతోంది.

### అధికారుల 'మామూలు' నిద్ర?

భారీ స్థాయిలో అక్రమాలు జరుగుతున్నా పౌరసరఫరాల శాఖ అధికారులు కనీసం అటువైపు చూడకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫిర్యాదులు అందినప్పుడు మొక్కుబడి తనిఖీలు చేయడం తప్ప, శాశ్వత పరిష్కారం చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం డీలర్లకు వరంగా మారిందని, కొందరు అధికారులకు ఈ అక్రమాల్లో వాటాలు అందుతున్నాయని ప్రజలు బాహాటంగానే చర్చించుకుంటున్నారు.

### బాధితుల ఆవేదన..

"రెక్కాడితే గానీ డొక్కాడని మా బతుకుల్లో రేషన్ బియ్యమే ఆధారం. అక్కడ కూడా మోసం చేస్తే మేం ఏం తినాలి? డిజిటల్ కాటాలో సరిగ్గా పడుతోందని నమ్ముతాం, కానీ ఇంటికి వెళ్లాక చూస్తే కిలోల కొద్దీ తక్కువ వస్తోంది."

- ఓ లబ్ధిదారుడి ఆవేదన

### డిమాండ్లు ఇవే..

జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల డిజిటల్ తూకం యంత్రాలపై తక్షణమే స్పెషల్ ఆడిట్ నిర్వహించాలి. మోసాలకు పాల్పడుతున్న డీలర్ల లైసెన్సులను తక్షణమే రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ప్రతి దుకాణంలో పారదర్శకత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించాలి. అధికారులు ఇకనైనా నిద్ర మత్తు వదిలి పేదవాడి బియ్యం పక్కదారి పట్టకుండా చూడాలని 'ప్రజా తీర్పు' డిమాండ్ చేస్తోంది.

# రిజర్వేషన్ల క్రెడిట్ ప్రతిపక్షాలకే

## వారికే ఖాళీ చెక్కు ఇచ్చేస్తున్నాం.. బిల్లు ఆమోదం పొందాక ప్రభుత్వ ఖర్చుతో ప్రతిపక్షాలకు ప్రచారం

- హోర్డింగ్‌లపై విపక్ష నాయకుల ఫొటోలు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నాం
- రిజర్వేషన్ల అమలును మీరు వ్యతిరేకిస్తే మాకే రాజకీయ ప్రయోజనం
- 2024లో తక్కువ సమయం ఉండడం వల్లే రిజర్వేషన్లు అమలు చేయలేకపోయాం
- 2029లో రిజర్వేషన్లు కల్పించకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు
- పునర్విభజనలో ఏ ఒక్క రాష్ట్రంపైనా వివక్ష చూపే ప్రసక్తే లేదు
- లోక్‌సభ స్థానాల నిష్పత్తిలో ఎటువంటి మార్పు ఉండదు
- లోక్‌సభలో ప్రధాని మోదీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుతో ముడిపడి ఉన్న నియోజకవర్గాల పునర్విభజనలో ఏ ఒక్క రాష్ట్రంపైనా వివక్ష చూపే ప్రసక్తే ఉండదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. అది పెద్ద రాష్ట్రమైనా లేక చిన్న రాష్ట్రమైనా.. ఉత్తర, దక్షి ణ, తూర్పు, పశ్చిమ రాష్ట్రమైనా కూడా ఎలాంటి అ న్యాయం జరగదని స్పష్టంచేశారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనలో సంస్కరణలను వ్యతిరేకించేవారిని మహిళలు ఎప్పటికీ క్షమించబోరని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గురువారం లోక్‌సభలో మూడు కీలక బిల్లులు ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ప్రధాని మోదీ జోక్యం చేసుకున్నారు. దాదాపు 40 నిమిషాలపాటు మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియతో ఏ ఒక్క రాష్ట్రంలోనూ లోక్‌సభ స్థానాల నిష్పత్తి తగ్గదని వెల్లడించారు.

లోక్‌సభ స్థానాలకు సంబంధించి ఆ నిష్పత్తిలో ఎటువంటి మార్పు ఉండదని, పెరుగుదల కూడా అదే నిష్పత్తిలో ఉంటుందని తెలిపారు. మహిళా రిజర్వేషన్ల చట్టం అమలుపై అధికార పక్షం ఘనతను(క్రెడిట్) ఆశించడం లేదని.. ఆ క్రెడిట్‌ను ప్రతిపక్షాలే తీసుకోవచ్చని సూచించారు. ప్రతిపక్షాలకే ఖాళీ చెక్కు ఇచ్చేస్తున్నానని తెలిపారు. అంతేకాకుండా బిల్లు ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వ ఖర్చుతో ప్రతిపక్షాలకు ప్రచారం చేస్తామని, హోర్డింగ్‌లపై ప్రతిపక్ష నాయకుల ఫొటోలు ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల అమలును ఒకవేళ ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తే తనకు సహజంగానే రాజకీయ ప్రయోజనం దక్కుతుందన్నారు. కానీ, విపక్షాలు సహకరిస్తే ఎవరికీ ఎలాంటి రాజకీయ ప్రయోజనమూ లభించదని చెప్పారు. ప్రధానమంత్రి ఇంకా ఏం మాట్లాడారంటే..

### ఉద్దేశం స్పష్టంగా ఉన్నప్పుడు..

"చట్టసభల్లో రిజర్వేషన్ అనేది ఈ దేశ మహిళల హక్కు. కాబట్టి వారికి తాము ఏదో ఇస్తున్నామనే భ్రమలో ఎవరూ ఉండకూడదు. రిజర్వేషన్లపై మాకు క్రెడిట్ వద్దు. ఈ విషయంలో హామీ(గ్యారంటీ) అనే పదాన్ని వాడాలని మీరు కోరుకుంటే నేను ఆ పదాన్నే వాడతాను. నేను వాగ్దానం(ప్రామిస్) చేయాలని మీరు కోరుకుంటే నేను ఆ పదాన్నే ఉపయోగిస్తా. ఎందుకంటే ఉద్దేశం స్పష్టంగా ఉన్నప్పుడు పదాలతో ఆడుకోవాల్సిన అవసరమే ఉండదు. నియోజకవర్గాల పునర్విభజనపై ఎవరికీ ఎలాంటి సందేహాలు, భయాందోళనలు అవసరం లేదు. ఏ ఒక్క రాష్ట్రానికీ అన్యాయం జరగదు, వివక్ష చూపడం ఉండదు.

### దయచేసి రాజకీయ కోణంలో చూడొద్దు

మహిళలకు హక్కులు కల్పించడాన్ని గతంలో వ్యతిరేకించినవారు మహిళల నుంచి ఆగ్రహాన్ని చవిచూశారు. తగిన పర్యవసానాలు ఎదుర్కొన్నారు. అలాంటి వారిని మహిళలు క్షమించలేదు. మహిళా రిజర్వేషన్లను దయచేసి రాజకీయ కోణంలో చూడొద్దని అందరినీ కోరుతున్నా. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నాం. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న మహిళలు మనల్ని గమనిస్తున్నారు. వారు మన నిర్ణయాలను పరిశీలిస్తారు. నిర్ణయం కంటే కూడా మన ఉద్దేశాన్ని ఎక్కువగా బేరీజు వేస్తారు.

మన ఉద్దేశంలో ఏమాత్రం లోపం ఉన్నా మహిళలు మనల్ని ఎప్పటికీ క్షమించరు. 2023లో పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్లపై చర్చ జరుగుతున్న సమయంలో 'త్వరపడండి'అంటూ ప్రజలు గొంతెత్తారు. కానీ, 2024లో మహిళా రిజర్వేషన్లు అమలు చేయలేకపోయాం. చాలా తక్కువ సమయం ఉండడమే అందుకు కారణం. ఇప్పుడు మనకు తగినంత సమయం ఉంది. 2029లో కూడా మహిళలకు రిజర్వేషన్లు కల్పించకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించవచ్చు. ఇకపై ఏమాత్రం ఆలస్యం చేయకూడదు. అదే నేటి అనివార్యత.

### ఆ ధైర్యం లేక సాకులు వెతుకుతున్నారు

మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని వ్యతిరేకిస్తే ప్రతిపక్షాలకే ప్రమాదం. దేశంలోని నారీ శక్తి అంతా నిశితంగా గమనిస్తోంది. మహిళల హక్కులను వ్యతిరేకించిన వారి పట్ల చరిత్ర ఎప్పుడూ దయతో వ్యవహరించలేదు. ఎంపీలందరినీ మహిళలు గమనిస్తున్నారు. రిజర్వేషన్ల విషయంలో ఎంపీల్లో తప్పుడు ఉద్దేశాలు ఉంటే ఆ విషయం మహిళలు ఎప్పటికీ మర్చిపోరు. అందుకే మన ఉద్దేశాల్లో నిజాయతీ ఉండాలి. మహిళా రిజర్వేషన్ల అమల్లో ఇప్పటికే 30 ఏళ్ల ఆలస్యం జరిగింది. మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడానికి ప్రతిపక్షాలు సాంకేతిక సాకులు (టెక్నికల్ బహానేబాజీ) వాడుతున్నాయి. మహిళల హక్కులను బహిరంగంగా తిరస్కరించే ధైర్యం వారికి లేదు. అందుకే సాంకేతిక సాకులు వెతుకుతున్నారు. కానీ, ఇప్పుడు మీరు మహిళలను మోసం చేయలేరు.

### నల్ల రంగు దుస్తులు ధరించినవారికి కృతజ్ఞతలు

మహిళా కోటా చట్ట సవరణ బిల్లుకు నిరసనగా కొందరు నల్ల రంగు దుస్తులు ధరించి సభకు రావడాన్ని గమనించాం. నల్ల రంగు దుస్తులు దిష్టి తగలకుండా కాపాడే 'కాలా టికా'లాగా పనిచేస్తాయి. కొందరు కొన్నిచోట్ల నల్ల జెండాలు కూడా ఎగురవేశారు. మన దేశంలో ఏదైనా శుభకార్యం ప్రారంభించే ముందు దిష్టి పోవడానికి నల్లటి తిలకం దిద్దుకొనే సంప్రదాయం ఉంది. ఈ రోజు నల్ల రంగు దుస్తులు ధరించి వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం"అని ప్రధాని మోదీ చెప్పారు.



# డీలిమిటేషన్.. తెలంగాణలో 26... ఏపీలో 38

- పునర్విభజన తర్వాత లోక్‌సభ స్థానాల సంఖ్య ఇదే!
- లోక్‌సభకు వెల్లడించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- దక్షిణాది రాష్ట్రాల్లో మొత్తం స్థానాల సంఖ్య 195కు
- వాటి ప్రాతినిధ్యానికి నష్టమూ ఉండదని వెల్లడి

**దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య, శాతాల్లో రాబోయే మార్పులు**

| రాష్ట్రం | ప్రస్తుత స్థానాలు (543) | 543 స్థానాల్లో ఎంత శాతం | పెంపు తర్వాత (సుమారు) | 816 స్థానాల్లో ఎంత శాతం |
|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 25 | 4.6 శాతం | 38 | 4.65 శాతం |
| తెలంగాణ | 17 | 3.13 శాతం | 26 | 3.18 శాతం |
| కర్నాటక | 28 | 5.15 శాతం | 42 | 5.14 శాతం |
| తమిళనాడు | 39 | 7.18 శాతం | 59 | 7.23 శాతం |
| కేరళ | 20 | 3.68 శాతం | 30 | 3.67 శాతం |
| మొత్తం | 129 | 23.76 శాతం (దాదాపు 24%) | 195 | 23.87 శాతం (దాదాపు 24%) |

న్యూఢిల్లీ: డీలిమిటేషన్ ప్రక్రియ అనంతరం తెలంగాణలో లోక్‌సభ స్థానాల సంఖ్య 17నుంచి 26కు, ఆంధ్రప్రదేశ్‌లో 25 నుంచి 38కి పెరగనున్నట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించారు. లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని స్పష్టం చేశారు. గురువారం లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ల చట్ట రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై జరిగిన చర్చలో అమిత్ షా ప్రసంగించారు. డీలిమిటేషన్ వల్ల లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందన్న ఆందోళనను ఆయన తోసిపుచ్చారు. పునర్విభజన అనంతరం ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాల సంఖ్య ప్రస్తుతమున్న 129 నుంచి 50 శాతం, అంటే 195కు పెరుగుతుందని వెల్లడించారు. "దక్షిణాది రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్ల సంఖ్య తగ్గదు. పైపెచ్చు సభలో వాటి ప్రాతినిధ్యం మరింత పెరుగుతుంది"అంటూ గణాంకాలతో సహా మంత్రి వివరించారు. "మొత్తం చర్చపై కేంద్ర ప్రభుత్వం తరపున శు క్రవారం సమాధానమిస్తాను. అయితే ఒక్క విషయం మాత్రం చెప్పదలచాను. తాజాగా ప్రవేశపెట్టిన బిల్లులపై ప్రజలకు ఎలాంటి అపోహలూ వద్దు. ఈ బిల్లులతో లోక్‌సభలో దక్షిణాది ప్రాతినిధ్యం తగ్గుతుందని, ఆ ప్రాంతానికి నష్టం జరుగుతుందని పెద్ద వాదనను లేవనెత్తుతూ భ్రాంతిని వ్యాప్తి చేస్తున్నారు. దీనిపై స్పష్టత ఇవ్వదలచాను. సభ ముందున్న బిల్లుల ఆధారంగా వాస్తవాలు అందరి దృష్టికి తెస్తాను. నియోజకవర్గాల పునర్విభజనతో ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాల సంఖ్య 25నుంచి 38కు, ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 4.60 నుంచి 4.65 శాతానికి పెరుగుతాయి. తెలంగాణలో స్థానాలు 17 నుంచి 26కు, ప్రాతినిధ్యం 3.13 నుంచి 3.18కి పెరుగుతాయి. తమిళనాడులో సీట్లు 39 నుంచి 59కు, ప్రాతినిధ్యం 7.18 నుంచి 7.23 శాతానికి పెరుగుతాయి. కర్నాటకలో లోక్‌సభ స్థానాలు 28నుంచి 42కు, సభలో ప్రాతినిధ్యం 5.15 శాతం నుంచి 5.14 శాతానికి చేరతాయి. కేరళలో సీట్లు 20 నుంచి 30కి, లోక్‌సభలో ఆ రాష్ట్ర ప్రాతినిధ్యం 3.68 నుంచి 3.67 శాతానికి చేరతాయి. మొత్తమ్మీద దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాల సంఖ్య 195కు పెరుగుతుంది. లోక్‌సభలో వాటి ప్రాతినిధ్యం 23.76 శాతం నుంచి 23.97 శాతానికి పెరుగుతుందే తప్ప ఏ మాత్రమూ తగ్గదు. అలాంటప్పుడు దక్షిణాదికి అన్యాయమన్న ప్రశ్నే తలెత్తదు"అని స్పష్టం చేశారు.

### జనగణనతో పాటే కులగణన

ప్రస్తుతం దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణనతో పాటే కులగణన కూడా ఉంటుందని అమిత్ షా స్పష్టం చేశారు. "కులగణన చేపట్టాలని కేంద్రం భావించడం లేదని విపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తన్నాయి. మోదీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. జనగణన రెండు దశల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇళ్ల గుర్తింపు ప్రక్రియ మొదలైంది. వ్యక్తిగత డేటాను తీసుకునేటప్పుడు కులగణన అంశం కూడా వస్తుంది"అని ఆయన స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన ఇప్పట్లో అమలు కాబోదని సభకు అమిత్ షా తెలియజేశారు. "డీలిమిటేషన్ కమిషన్ నివేదికను పార్లమెంటు ఆమోదించి, రాష్ట్రపతి ముద్ర పడిన తర్వాతే అమల్లోకి వస్తుంది. ఇదంతా 2029కి ముందు జరిగే ప్రసక్తే లేదు. కనుక అప్పటిదాకా పలు రాష్ట్రాల్లో ఎన్నికలు పాత నియోజకవర్గాల ప్రాతిపదికనే జరుగుతాయి" అని చెప్పారు.

### లోక్‌సభ మొత్తం స్థానాల సంఖ్య 816!

లోక్‌సభలో సీట్ల సంఖ్య పెంపుపై విపక్షాల ప్రశ్నలకు బదులిస్తూ అమిత్ షా ఒక ఉదాహరణ చెప్పారు. "మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే ముందుగా మొత్తం సీట్లను 50 శాతం పెంచాలి. అప్పుడు వాటిలో 33 శాతం మహిళలకు కేటాయించినా మిగతా ఓపెన్ సీట్ల సంఖ్య యథాతథంగా ఉంటాయి. అంటే ప్రస్తుతమున్న 543 సీట్లను 50 శాతం పెంచితే వాటిలో 33 శాతాన్ని మహిళలకు రిజర్వ్ చేశాక కూడా ఓపెన్ కేటగిరీలో 543 సీట్లు అందుబాటులో ఉంటాయి. కాబట్టే 50 శాతం పెంపును ప్రతిపాదించాం"అని ఆయన వివరించారు. "లోక్‌సభ స్థానాల పెంపు గరిష్టంగా 850 దాకా అనేది సుమారుగా వేసిన సంఖ్య. కచ్చితమైన సంఖ్య బహుశా 815, లేదా 816గా ఉండవచ్చు. దీనిపై సభకు సమగ్రంగా వివరణ ఇస్తా"అని చెప్పారు.



# చాణక్యుడు బతికి ఉంటే.. బీజేపీ చాతుర్యానికి ఆశ్చర్యపోయేవాడు

(మొదటి పేజీ తరువాయి)

తగ్గించి, ప్రజాస్వామ్యాన్ని ముక్కలు చేసి, వచ్చే ఎన్నికల్లో లబ్ధి పొందే కుట్ర జరుగుతోందని ధ్వజమెత్తారు. తన మాటలకు అమిత్ షా నవ్వుతున్నారని, ఈ స్కీమ్ వెనుక ఆయనే ఉన్నారని చెప్పారు. అమిత్ షా నవ్వుతున్నారంటే తన వ్యాఖ్యలతో ఆయన ఏకీభవించినట్టేనని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో ఏకైక చాంపియన్‌గా మారాలన్నది బీజేపీ ఎత్తుగడగా కనిపిస్తోందని అన్నారు. పురుషులతో సమానంగా మహిళలకు హక్కులు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దేనని ప్రియాంక తేల్చిచెప్పారు. 'ఒక ఓటు, ఒక పౌరుడు, ఒకే విలువ'అనే విధానాన్ని కాంగ్రెస్ తీసుకొచ్చిందన్నారు. దీనివల్ల దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే మహిళలకు ఓటు హక్కు లభించిందన్నారు. అమెరికాలో ఓటు హ క్కు కోసం మహిళలు 150 ఏళ్లు ఎదురుచూడాల్సి వచ్చిందని గుర్తుచేశారు.

### ఇప్పుడున్న స్థానాల ఆధారంగానే రిజర్వేషన్లు

కేవలం అధికారం కోసమే మహిళా రిజర్వేషన్ల అంశాన్ని వాడుకుంటున్నారని మోదీ ప్రభుత్వంపై ప్రియాంక నిప్పులు చెరిగారు. ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదించినట్లయితే దేశంలో ప్రజాస్వామ్యం ఉనికిలో లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తంచేశారు. మహిళా కోటా చట్టాన్ని డీలిమిటేషన్‌తో ఎందుకు ముడిపెట్టారో చెప్పాలని నిలదీశారు. లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న స్థానాల ఆధారంగానే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని అన్నారు.



# ఆర్టిజన్ల సమ్మె 9వ రోజుకు చేరిక

## చర్చలకు ముందుకు రాని ప్రభుత్వం

**రామగుండం, ఏప్రిల్ 15 (ప్రజా తీర్పు):**

విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె గురువారం 8వ రోజుకు చేరుకుంది. తమ సమస్యలపై చర్చలకు పిలవకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆర్టిజన్లు ఆరోపించారు. గత ఎనిమిది రోజులుగా నిరవధిక సమ్మెలో పాల్గొంటున్న ఆర్టిజన్లు, తమను విద్యార్హతల ఆధారంగా సేవల్లో విలీనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఒకే సంస్థలో ఒకే విధమైన నియమాలు అమలు చేయాలని వారు ప్రధానంగా కోరుతున్నారు. అయితే తమ డిమాండ్లను యాజమాన్యం పట్టించుకోకపోగా, ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు పాల్పడటం రాజ్యాంగ విరుద్ధమని ఆర్టిజన్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని పెద్దపల్లి జిల్లా బీసీ జేఏసీ అధ్యక్షురాలు దాసరి ఉషా, టీఆర్ఎస్ నాయకులు వ్యల హరీష్ రెడ్డి సందర్శించి, ఆర్టిజన్ల సమ్మెకు మద్దతు తెలిపారు. సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కొంకటి శ్రీనివాస్, వడ్డేపల్లి సురేష్, ఆవుల మహేష్, దుర్గం విశ్వనాథ్, జి. రాజు, మల్లారపు ప్రభాకర్, ఎస్. రవి, ధర్మ నాయక్, సందీప్, ప్రణయ్, జనార్ధన్, సదానందం, కుమార్, పవన్, రవి కుమార్, వేణు, ధనేష్, శ్రీకృష్ణ, అన్వర్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.



# విన్నూత్న కార్యక్రమాలకు నిలయాలు ప్రభుత్వ పాఠశాలలు

## ప్రధానోపాధ్యాయులు బి.బన్నాజి.

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 16**

పీఎం శ్రీ. స్పెషల్ ఎన్రోల్మెంట్ ఇంప్రూవ్ మెంట్ డ్రైవ్ 2026బి27 లో భాగంగా స్థానిక పీఎం శ్రీ. జిల్లా పరిషత్ హై స్కూల్. గర్ల్స్ హై స్కూల్, వేములవాడ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మరియు ఉపాధ్యాయులు ఈరోజు ఉదయం విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం డోర్ టు డోర్ సర్వే చేసి వచ్చే విద్యా సంవత్సరం లో పాఠశాల లో చేర్పించాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. బన్నాజి మాట్లాడుతూ పిఎం శ్రీ. పాఠశాల లో అనేక ప్రత్యేక వసతులు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మా పాఠశాల లో డిజిటల్ తరగతులు, రోబోటిక్స్, వృత్తి విద్య (రిటైల్ ఌ ఫైనాన్స్),కంప్యూటర్ లాబ్, అటల్ లాబ్, డైలీ న్యూస్ పేపర్, కరెంట్ అఫ్ఫైర్స్, కళలు,సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా, సెల్ఫ్ డిఫెన్స్ కరాటే, సైన్స్ ఫెయిర్,మ్యాథ్స్ ఫెయిర్, విజ్ఞాన, విహార యాత్ర లాంటి విన్నూత్న కార్యక్రమాలు ఉంటాయని, విద్యార్థులకు మిడ్ డే మీల్స్, రాగి జావా లాంటి పోషకాహారం ఉంటుందని. తెలియ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి. కృష్ణ, ఎం.హరికృష్ణ, టి. మాధవి, కె.రాధిక, టి.సరిత, ఏ.సరళ, పి. సత్య నారాయణ, పి.రవీందర్ రావు, సీహెచ్. అరుంధతి, ఎన్.స్వాతి, టి.బాబురాజ్, కె.సుచరిత, ఏ. సునీత మరియు తదితరులు పాల్గొన్నారు.




# రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం

- ప్రజలందరూ రోడ్డు భద్రత నిబంధనలను పాటించండి,
- ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన ధ్యేయం:
- బెల్లంపల్లి టూ. టౌన్ ఎస్సై కిరణ్ కుమార్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఏప్రిల్ 16**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణ భద్రతను ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని అరైవ్ అలైవ్,2026, రెండవ దశ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి టూ టౌన్ ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఐపీఎస్,పర్యవేక్షణలోభాగంగా బుధవారం రోజున స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్ పర్సన్, ముఖ్య అతిథులుగా పాల్గొని పలు సూచనలు అందజేయడం జరిగింది. పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల తగ్గింపు, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన కల్పించడం, సురక్షిత ప్రయాణ చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ క్యాంపెయిన్ గత కొద్ది రోజుల నుండి ప్రతి రోజు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ముఖ్య కూడళ్ల వద్ద సైన్‌బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన సమాచారాన్ని ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. లేన్ డిసిప్లిన్ డ్రైవ్‌లో భాగంగా తప్పుగా ఓవర్‌టేకింగ్ చేసే వాహనాలపై కఠిన తనిఖీలు నిర్వహించి, ఎడమ లేన్ డ్రైవింగ్‌ను తప్పనిసరిగా అమలు చేస్తామని తెలిపారు. హెల్మెట్ అమలు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక తనిఖీ డ్రైవ్‌లు నిర్వహించి, పాఠశాలలు, కళాశాలలు, మార్కెట్ ప్రాంతాల్లో ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా సీట్‌బెల్ట్ అమలు కార్యక్రమంలో భాగంగా ప్రధాన కూడళ్లలో నాలుగు చక్రాల వాహనాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడపరాదనే అంశంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి, బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రజల భద్రత, ప్రాణ రక్షణ పోలీస్ శాఖ ప్రధాన ధ్యేయమని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై తెలిపారు...

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై మండల సభ

**రామడుగు, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు ప్రతినిధి)**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణపై రామడుగు మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎంపీడీవో ఎస్. రాజేశ్వరి ఆధ్వర్యంలో మండల సభ నిర్వహించగా, తహసీల్దార్ బి. రాజేశ్వరి, ఎస్సై కోదాటి రాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొని ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, అమలవుతున్న పథకాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మండలంలోని 23 గ్రామాల్లో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని అధికారులు వివరించారు. వారి వివరాల ప్రకారం రైతు భరోసా పథకం కింద 14,228 మంది రైతులకు రూ. 30.52 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించగా, నేచరల్ ఫార్మింగ్‌లో 125 మంది రైతులు పాల్గొంటున్నారు. సాయిల్ హెల్త్ కార్డులు 5,815 మంది రైతులకు జారీ చేయగా, సన్నరకం వరి బోనస్ కింద రూ. 76.12 లక్షలు చెల్లించారు. రెవెన్యూ శాఖ ద్వారా భూభారతి కింద వచ్చిన 86 ఫిర్యాదుల్లో 47 పరిష్కరించగా, 1,985 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరు చేశారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పథకాల కింద మూడు సంవత్సరాల్లో 567 మంది లబ్ధిదారులకు రూ. 5.67 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని 16,936 కుటుంబాలకు ప్రతి నెల 3.11 లక్షల కిలోల రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారు. చేయూత పింఛన్ల కింద 8,309 మందికి ప్రతి నెల రూ. 1.91 కోట్లకు పైగా పంపిణీ జరుగుతోంది. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద 737 ఇళ్ల నిర్మాణం మంజూరవగా, ప్రస్తుతం 42 ఇళ్లు పూర్తయ్యాయి. 87 ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉండగా, రూ. 13.20 కోట్ల నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యాయి. జిల్లాలో ఈ పథకంలో రామడుగు మండలం మూడవ స్థానంలో నిలిచినట్టు అధికారులు పేర్కొన్నారు. గృహ జ్యోతి పథకం ద్వారా 9,209 కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందించగా, రూ. 6.69 కోట్ల వ్యయం జరిగింది. మహాలక్ష్మీ పథకం కింద 10,147 మంది లబ్ధిదారులకు 39,430 గ్యాస్ సిలిండర్లపై రూ. 1.22 కోట్ల సబ్సిడీ ఇచ్చారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో 1,169 మహిళా సంఘాలు పనిచేస్తుండగా, బ్యాంక్ లింకేజీ ద్వారా రూ. 66.88 కోట్ల రుణాలు మంజూరయ్యాయి. ఉపాధి హామీ పథకం కింద 272 పనులు ఆమోదం పొందాయి. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో రూ. 15.96 కోట్ల అంచనాతో 213 అభివృద్ధి పనులు చేపట్టగా, సీసీ రోడ్లు, పాఠశాల మరమ్మత్తులు, అంగన్వాడీ భవనాలు నిర్మిస్తున్నారు. శిశు సంక్షేమం కింద 58 అంగన్వాడీ కేంద్రాల్లో 1,985 మంది చిన్నారులు నమోదు కాగా, ఆరోగ్య శాఖలో 898 గర్భిణులు నమోదు అయ్యారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 78 వేల మందికి పైగా చికిత్స అందించారు. ఈ సందర్భంగా అధికారులు రాబోయే పథకాలైన అల్పాహార పథకం, కుటుంబ జీవన భీమా, ఇంటర్మీడియట్ వరకు మధ్యాహ్న భోజనం, వికలాంగ విద్యార్థులకు వాహనాలు, సేంద్రీయ వ్యవసాయం వంటి కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, మండల సమైక్య ప్రెసిడెంట్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ పాలన అధికారులు, వివో ఏలు హాజరయ్యారు.

# రేపు నాలుగు మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

## ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్

**భైంసా, ఏప్రిల్ 16 (ప్రజా తీర్పు)**



మొక్కజొన్న రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని అంతటా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ తెలియజేశారు. రేపు నాలుగు మండలాల్లో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నట్లు ఆయన తెలియజేశారు. బాసర, ముధోల్, లోకేశ్వరం, తానూర్ మండలాల్లో రేపు కొనుగోలు ప్రారంభిస్తామని, ఈపాటికి కొన్నిచోట్ల కేంద్రాలు ప్రారంభించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో మొక్కజొన్న పంట అధికంగా ఉన్నందున ఎక్కువ స్థాయిలో కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, అవసరం ఉన్నచోట్ల సబ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. తక్కువ ధరకు తమ పంటను రైతులు అమ్ముకోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే పంటలను అమ్మాలని ఆయన సూచించారు. కేంద్రాల విషయంలో సంబంధిత శాఖ మంత్రికి, అధికారులకు మాట్లాడడం జరిగిందని, అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.



# ఆపదలో ఉన్న తన కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన మోహనరావు పాటిల్ ప్రజా ట్రస్ట్ చైర్మన్

**భైంసా, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

స్థానిక భైంసా పట్టణానికి చేందిన జాదవ్ సావిత్రి బాయి గారి భర్త బాబురావు ఇటీవల మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న ప్రజా ట్రస్ట్ చైర్మన్ వారి కుటుంబానికి నిత్య అవసరాల నిమ్మిత్తం మోహన్ రావు పటిల్ గారు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందివ్వడం జరిగింది అదే విధంగా తాను మాట్లాడుతూ తాము చేసిన పల్లె పల్లెకు బీజేపీ గడప గడపకు మోహన్ రావు పటేల్ కార్యక్రమం విజయవంతం చేయడంలో జాదవ్ సావిత్రి బాయి కుమారుడు గణేష్ గారి యొక్క కృషి ఉంది అని చెప్పడం జరిగింది అదే విధంగా అనుకోని సంఘటనలు జరిగినపుడు మా ప్రజా ట్రస్ట్ పేద,మధ్య తరగతి కుటుంబాలకు సహాయపడటంలో ముందు ఉంట్టది అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో చైర్మన్ మోహన్ రావు పటిల్ ప్రజా ట్రస్ట్, కౌన్సిలర్ అల్లం దిలీప్, బిజెపి సీనియర్ నాయకులు సుభాష్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



# పూర్తయిన పల్లె దవాఖానా భవనం ఎందుకు ప్రారంభం కాలేదు?

## అధికారులపై సర్పంచ్ అసంతృప్తి

**భైంసా, ఏప్రిల్ 16 (ప్రజా తీర్పు)**

కాంట్రాక్టర్ ప్రభుత్వ భవనాన్ని అధీనం లో ఉంచుకుంటే చూస్తూ ఊరుకుంటున్నారని ఆవేదన సమస్యలు పరిష్కరించడం లో అధికారులు సహకరించడం లేదని దేగాం గ్రామం లో పల్లె ధవాఖానా భవన నిర్మాణం పూర్తి అయి ప్రజలకు అందుబాటులో తేవడం లేదని అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యం ఉందని ఇప్పటికైనా పేద ప్రజల ఆరోగ్యాన్నిదృష్టిలో ఉంచుకోని నూతనంగా నిర్మించిన భవనాన్ని తక్షణమే ప్రారంభించాలని దేగాం సర్పంచ్ సిరం సుష్మరెడ్డి కోరారు.. బిల్లులు రాలేదంటూ భవనం నిర్మించిన కాంట్రాక్టర్ బిల్డింగ్ కు తాళం వేసి ఉంచితే అధికారులు ఎం చేస్తున్నారని ప్రశ్నించారు. గురువారం పల్లె ప్రగతి ప్రజా ప్రణాళిక కార్యక్రమం లో భాగంగా వానల్ పాడ్ గ్రామం లో నిర్వహించిన మండల స్థాయి సమావేశం లో ఆమె తన ఆవేదన ను వెళ్ళగక్కారు.. ఈ విషయం పై పలు మార్లు అధికారులకు పిర్యాదు చేసిన స్పందన కరువైందన్నారు. దేగాం తో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు ఈ పల్లె ధవాఖానా ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. తక్షణమే ప్రారంభించక పోతే భవనం తాళం పగులగోడుతానని హెచ్చరించారు.. సమావేశం లో ఉన్న మార్కెట్ కమిటి చైర్మన్ అనంద్ రావ్ పటేల్ కాంట్రాక్టర్ కు ఫోన్ లో మాట్లాడారు. భవనాన్ని ప్రజలకు అందుబాటులో తెచ్చేవిధంగా చర్యలు చేపడతామన్నారు. అదే విధంగా పలు సమస్యల పై సర్పంచ్ మాట్లాడారు.

# మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు

**జగిత్యాల రూరల్, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**



జగిత్యాల జిల్లా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మల్యాల ఎస్ఐ ఏ. నరేష్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతే ప్రమాదాలు జరిగి కుటుంబాలు వీధిన పడుతాయని అన్నారు. కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకొని మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల వలయంలో ఎల్లారెడ్డిపేట గ్రామం

**సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట గ్రామంలో ఉన్న సమస్యలు వింటుంటే సమస్యల వలయంలో చిక్కుకున్నట్లుగా అనిపిస్తుందని కొంతమంది ప్రజాతీర్పు విలేకరితో అన్నారు. గ్రామంలోని వివిధ కాలనీలో విద్యుత్ దీపాలు లేవని స్థానిక కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటూ సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించడం లేదంటున్నారు. ప్రతి ఏటా ఇంటి పన్ను కాల పరిమితి కంటే ముందే అడ్వాన్స్ టాక్స్ వాసులు చేస్తూ నల్ల బిల్లు10%,విద్యుత్తు వీధి లైట్ల బిల్లు 10%, గ్రంధాలయం బిల్లు 08%, డ్రైనేజి బిల్లు 10%,చెల్లిస్తున్నామని, మరి సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ప్రాంతాల్లో వీధిదీపాలు లేక కానీ వాసులు నడుచుకుంటూ వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాలలో డ్రైనేజీలు శుభ్రత లేక రోగాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నామన్నారు. ప్రతిరోజు చెత్త ట్రాక్టర్ సరైన సమయానికి రాక చెత్తను ట్రాక్టర్కు అందియాల్సినటువంటి కొంతమంది కాలనీ వాసులు రోడ్లమీద ఇష్టం వచ్చినట్లు చెత్తాచెదానం పారేస్తున్నారు. సర్పంచ్ పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గ్రామంలో రోడ్ల పైన విపరీతమైన ప్లాస్టిక్ కవర్లు పారేసి పర్యావరణాన్ని కాల్షియం కలుషితం చేస్తుందని దీనిపైన పంచాయతీ కార్యదర్శి ప్రత్యేక దృష్టి చారించాలన్నారు. మటన్ మార్కెట్ లో మురికి కాలువ లో మాంసపు వ్యర్థాలు వెయ్యడంతో పూర్తిగా నిండిపోయి కొడుతుందన్నారు. పలు ఇండ్ల సముదాయాల మధ్యలో కొంతమంది వ్యక్తులకు సంబంధించినటువంటి కమర్షియల్ ఇండ్ల స్థలాలు ఖాళీగా ఉండడంతో చుట్టుపక్కల ఉన్న ఇంటిలోని వ్యక్తులు ఆ స్థలంలో చెత్తాచెదారం వెయ్యడంతో దుర్గంధం వెదజల్లి దోమలు, ఈగలు,పందులు తిరగడంతో విష జ్వరాలు వ్యాపిస్తుందన్నారు. వేసవికాలం ఉన్నందున పలు కాలనీలలో మంచినీటి సరఫరా సరిపోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటే, 9,10, 11 కాలనీలో మిషన్ భగీరథ నీరు రోడ్లపైనే వృధాగా పోతుంది. ప్రతి శుక్రవారం జరిగే వారసంతకు వచ్చే ప్రజలకు, కూరగాయలు అమ్ముకునే వ్యాపారులకు సరైన వసతులు, మూత్ర శాలలు లేక ఎక్కడ చీకటి ఉంటే అక్కడే మూత్ర,మల విసర్జన చేస్తున్నారు. ఎమ్మార్వో, ఎంపీడీవో, ఎంఈఓ కార్యాలయాలతో పాటు మరి కొన్ని కార్యాలయాలు చుట్టూ చెత్త,చెదారం పేరుకుపోయిన దృశ్యాలను అక్కడికి పలు సమస్యలకై వచ్చే మండల ప్రజలు పారిశుద్ధ్యం వైఫల్యం ఉందని ఆరోపించారు. ఇక శనివారం గొర్ల,మేకల అంగడి చూస్తే అక్కడ ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా సమస్యల తో ఎల్లారెడ్డిపేట గ్రామం సమస్యల వలయంలో చిక్కుకున్నట్లుగానే అనిపిస్తుంది. మరి సర్పంచ్,పాలకవర్గం, పంచాయతీ,కార్యదర్శి,లు ఇప్పటికైనా స్పందించకుంటే జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తామన్నారు.

# సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం డ్రైవర్ల ప్రధాన బాధ్యత

**( గుండేటిరాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 16.**



జగిత్యాల జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు నాలుగవ రోజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ పరిధుల్లో వాహన డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షల శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడం, గ్రామం నుంచి జిల్లా స్థాయి వరకు రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వాహన డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై కూడా దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు.రోడ్డు ప్రమాదాలు ఎప్పుడు, ఎలా జరుగుతాయో ముందుగా ఊహించలేమని, కాబట్టి నివారణ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు దారితీస్తాయని, అలాంటి సంఘటనల వల్ల కుటుంబాలకు తీరని నష్టం కలుగుతుందని అన్నారు. ప్రతి డ్రైవర్ బాధ్యతాయుతంగా వ్యవహరించి ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.రోడ్డు ప్రమాదాలలో అధిక శాతం, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం మరియు చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయడం వలననే జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ మరియు బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే, ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని అన్నారు.అందువల్ల డ్రైవర్లు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా, సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఈ శిబిరంలో అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు నిర్వహించడం జరిగింది. అవసరమైన డ్రైవర్లకు తగిన సూచనలు ఇచ్చి, చూపు సమస్యలు గుర్తించిన వారికి ఉచితంగా కళ్లద్దాలు అందజేయడంతో పాటు అవసరమైన మందులు కూడా పంపిణీ చేశారు.



## వేములవాడ ఎక్సైజ్ స్టేషన్‌లో రవికుమార్‌కు ఘన సన్మానం

- జ్ఞాపిక అందజేసిన ఎక్సైజ్ సీఐ

**కరీంనగర్, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

బుధవారం సాయంత్రం వేములవాడ ఎక్సైజ్ స్టేషన్లో విధులు నిర్వహించి కరీంనగర్ కు బదిలీ అయిన ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ పసుల రవికుమార్ను బుధవారం వేములవాడ ఎక్సైజ్ స్టేషన్లో ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ అభినందించి జాపికను బహూకరించారు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ రవికుమార్ వికలాంగులకు నిరుపేద వృద్ధులకు అనాధ ఆశ్రమలలో అన్నదానాలు చేస్తూ సామాజిక సేవలు చేస్తూ పలువురి తో ప్రశంసలు సన్మానాలు అవార్డ్స్ ఎన్నో అందుకున్న రవికుమార్ ఎక్సైజ్ శాఖ కు గర్వకారణం అని అన్నారు వేములవాడ లో అంకితభావాంతో విధులు నిర్వహించారని పేర్కొన్నారు, వేములవాడలో పనిచేసిన కాలంలో ఏ పని చెప్పినా ఓర్పుతో శ్రమతో ఆ పని పూర్తి చేసేవాదని కొనియాడారు, కార్యక్రమంలో సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ కానిస్టేబుల్ హెడ్ కానిస్టేబుల్ ఉమ్మడి జిల్లా యూనియన్ అధ్యక్షులు నగేష్ గౌడ్ పాల్గొన్నారు, ఈ పసుల రవికుమార్ మాట్లాడుతూ మా అధికారి ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ అభినందిస్తూ జ్ఞాపికను బహూకరించడం నాకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు,తనను అభినందించిన అధికారులకు ఈ సందర్భంగా రవి కృతజ్ఞతలు తెలియజేసారు.



## దివ్యాంగుల సమస్యలపై కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మతో టి ఆర్ వి యస్ నాయకుల భేటీ

**(మొక్క ఉపేందర్ ప్రజా తీర్పు ప్రతినిధి హైదరాబాద్) ఏప్రిల్ 16**

రాష్ట్రంలోని దివ్యాంగుల సమస్యలు, సంక్షేమ కార్యక్రమాల అమలు లోపాలపై తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి నాయకులు రాష్ట్ర వికలాంగుల చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ గారిని కలుసుకొని సమగ్రంగా చర్చించారు. మల్కాపేట్‌లోని వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో టి ఆర్ వి యస్వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ మున్నా, రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నయీమ్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సుతారి రమేష్ పాల్గొని దివ్యాంగుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో జరుగుతున్న తాజా పరిణామాలను వివరించి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ దివ్యాంగులకు ఇచిన హామీలు ఎవొక్కోటి నెరవేచక పోవడం బాధకారం అని, గత 10 సంవత్సరాలుగా రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీల పునర్వ్యవస్థీకరణ జరగకపోవడం తీవ్ర సమస్యగా మారిందని వారు పేర్కొన్నారు. దీనివల్ల దివ్యాంగుల సంక్షేమ కార్యక్రమాల అమలులో లోపాలు తలెత్తుతున్నాయని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమం మరియు సాధికారత కోసం 10 ముఖ్య డిమాండ్స్‌ను వినతిపత్రంలో ఉంచింది. రాష్ట్ర స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు, దివ్యాంగుల హక్కుల చట్టం--2016 అమలు, బ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీ, రిజర్వేషన్ల సమీక్ష, మెడికల్ బోర్డు పారదర్శకత, జిల్లాల వారీగా సంక్షేమ శాఖల బలోపేతం, టిసిపస సెంటర్ల అభివృద్ధి, టిసిపిసి ఉపాధి సబ్సిడీలు, మూడు చక్రాల వాహనదారులకు పెట్రోల్ సబ్సిడీ వంటి అంశాలను ప్రాధాన్యంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ స్పందిస్తూ, దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వ మరియు సంబంధిత మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దివ్యాంగుల సమస్యలపై పోరాటం చేస్తున్న సంఘాలను గౌరవిస్తున్నానని, అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే ఫలితాలు సాధ్యమవుతాయని అన్నారు. దివ్యాంగుల హక్కుల పరిరక్షణలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించాలని, సమర్పించిన డిమాండ్స్‌ను అత్యవసరంగా అమలు చేయాలని టి ఆర్ వి యస్ నాయకులు కోరారు. సమావేశంలో పాల్గొన్న నాయకులు చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



## పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ. క్యాడెట్లకు ఘన వీడ్కోలు

**పటాన్ చేరు, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో పట్టభద్రులవుతున్న ఎన్.సీ.సీ. క్యాడెట్లకు గురువారం హృదయపూర్వక వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడలు, ఎన్.సీ.సీ. డైరెక్టరేట్ నిర్వహించిన ఈ కార్యక్రమంలో గీతంతో పాటు, దేశానికి వారు అందించిన ఆదర్శప్రాయమైన సేవ, అంకితభావం, క్రమశిక్షణలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు ముఖ్య అతిథిగా పాల్గొన్న గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు పట్టభద్రులవుతున్న క్యాడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్.సీ.సీ. శిక్షణ యొక్క నిజమైన విలువ కేవలం 'సి' సర్టిఫికేట్ సంపాదించడం వరకే పరిమితం కాదని చెప్పారు. 'ఇది మీకు స్థైర్యం, క్రమశిక్షణ, సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తుంది. ఈ గుణాలే దేశానికి అర్థవంతంగా సేవ చేసేందుకు మీకు మార్గదర్శకంగా ఉంటాయి అని అన్నారు. రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం-క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ అతిథులుగా హాజరై, పట్టభద్రులవుతున్న క్యాడెట్ల అంకితభావాన్ని, వారి సేవను ప్రశంసించారు.ఈ సందర్భంగా, అసోసియేట్ ఎన్.సీ.సీ. ఆఫీసర్ (ఏ.ఎన్.ఓ) లెఫ్టినెంట్ ఎస్. అజయ్ కుమార్ తన శిక్షణను విజయవంతంగా పూర్తిచేసి, లాంఛనంగా ఆ హోదాను స్వీకరించినందుకు అతిథులు ఆయనను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో, పట్టభద్రులవుతున్న క్యాడెట్లు తమ ఎన్.సీ.సీ. ప్రస్థానం ఎంత గొప్పదో పంచుకోగా, జూనియర్ క్యాడెట్లు తమ కృతజ్ఞతలు, అభినందనలను తెలియజేశారు. పట్టభద్రులవుతున్న క్యాడెట్లకు జ్ఞాపికలను అందజేశారు. ఎన్.సీ.సీ. విజయాలను ప్రముఖంగా ప్రస్తావిస్తూ, ప్రత్యేకంగా రూపొందించిన వీడియో, అలాగే మరపురాని క్షణాలను చిత్రీకరించిన ఆడియో-విజువల్ ప్రజెంటేషన్, ఈ కార్యక్రమానికి గత స్మృతులను జోడించాయి. క్యాడెట్లు ప్రదర్శించిన శాస్త్రీయ సంగీత ప్రదర్శనలు, ఆసక్తికరమైన కార్యకలాపాలు ప్రేక్షకుల మన్ననలను పొందాయి. సీనియర్ క్యాడెట్ల వందన సమర్పణతో ఈ కార్యక్రమం ముగిసింది. అనంతరం గ్రూపు ఫోటో, విందుతో ఈ చిరస్మరణీయ వేడుక ముగిసింది.



## ప్రతి ఒక్కరు విధిగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 16:**

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు వేములవాడ డిఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వేములవాడ పట్టణ పోలీసులు పలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పట్టణ పరిధిలోని ప్రమాదాలు అధికంగా జరిగే ప్రదేశాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి ఆయా ప్రాంతాల్లో రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు రబ్బర్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడం, జిబ్రా క్రాసింగ్ పెయింటింగ్ చేయడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టారు. అలాగే మలుపుల వద్ద వాహనదారులకు స్పష్టంగా కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు, రోడ్డుకు ఇరువైపులా వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగేలా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు వంటి చర్యలు చేపట్టడం జరిగిందన్నారు.ఈ చర్యల ద్వారా వాహనదారుల్లో అప్రమత్తత పెరిగి రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పడతాయని అధికారులు తెలిపారు. ప్రజలు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటిస్తూ భద్రతతో ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్ వీరప్రసాద్, ట్రాఫిక్ ఆర్.ఐ సురేష్, ఎస్.ఐ.లు రామ్మోహన్, రాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## హర్జా నాయక్ మృతదేహానికి నివాళులు - ఆర్టీఐ నేతల సంతాపం

**చెన్నారావుపేట, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**



చెన్నారావుపేట మండలం పాపయ్య పేట గ్రామంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ నర్సంపేట నియోజకవర్గం ఇంచార్జ్ జాటోత్ యాకూబ్ నాయక్ తండ్రి హర్జనాయక్, అనారోగ్యంతో గురువారం మృతి చెందిన విషయం తెలుసుకున్న సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా కమిటీ సభ్యులందరూ పాపయ్యపేట గ్రామానికి చేరుకొని హజ్జా నాయక్ మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ జిల్లా అధ్యక్షుడు కాటా కుమారస్వామి జిల్లా ప్రధాన కార్యదర్శి మన్యం వీరేందర్ రెడ్డి నియోజకవర్గాల ఇంచార్జ్ కూస సుదర్శన్ పటేల్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లాడి వీరారెడ్డి చెన్నారావుపేట మండల ప్రధాన కార్యదర్శి చెలుకల పెల్లి రాజు కార్యదర్శి బేతి రజాకర్ దుగ్గొండి మండల అధ్యక్షుడు గూడెపుఅమరేందర్ ,సుభాన్, రాజేందర్ తదితర పాత్రికేయ మిత్రులు పాల్గొన్నారు.

## మంత్రి సతీమణి కాంతకుమారి జన్మదినం సందర్బంగా పండ్ల పంపిణి చేసిన వీరాభిమాని



**పెగడపల్లి, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సతీమణి శ్రీమతి అడ్లూరి కాంతకుమారి జన్మదిన దిన వేడుకలు జగిత్యాల జిల్లాలో గురువారం రోజున ఘనంగా జరిగాయి.ఈ సందర్బంగా పెగడపల్లి మండలంనకు చెందిన కాంతకుమారి వీరాభిమాని బుర్ర సంపత్ గౌడ్ జగిత్యాల పట్టణంలోని వాల్మీకి ఆవాసం - సేవా భారతి అనాధ ఆశ్రమంలో 65 మంది అనాధ పిల్లలకు పండ్ల పంపిణి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, కాంత కుమారి గారి మీద ఉన్న అభిమానం తో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని అన్నారు. తదనంతరం ఆశ్రమంలోని అనాధపిల్లలు కాంత కుమారి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు. వారు ఎల్లపుడు ఆయురారోగ్యాలతో జీవించాలని భగవంతున్నీ కోరుకున్నారు.

# అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం

### చెరువుల్లోకి కాలుష్య జలాలు వదిలితే భరతం పడతాం

**పటాన్ చేరు, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**



ప్రజలకు ఉపాధి లభిస్తుందని పరిశ్రమల స్థాపనకు స్వాగతం పలికితే.. నేడు అవే పరిశ్రమలు ప్రజల ప్రాణాలు తీస్తూ.. ప్రతి రోజు కాలపూట విషాన్ని వెదజల్లుతున్నాయని.. తీరు మార్చుకోకపోతే ప్రజల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని పటాన్చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. గడ్డపోతారం మున్సిపల్ పరిధిలోని చెట్ల పోతారం పరిధిలోగల అయ్యమ్మ చెరువు పరిస్థితిపై సోమవారము ఉదయం మున్సిపల్ పాలకవర్గం సభ్యులు, వివిధ శాఖల అధికారులతో కలిసి చెరువు కట్టపైనే ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరువులో కాలుష్య జలాలు కలవడం మూలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే జీఎంఆర్ కు తెలిపారు. ప్రతి రోజు ప్రత్యక్ష నరకం అనుభవించడంతోపాటు.. క్యాన్సర్ లాంటి వ్యాధులు సోకి ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్యపరంగా తమ బతుకులు చిద్రమవుతున్నాయని వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. గడ్డపోతారం పరిధిలో పరిశ్రమల ఏర్పాటు ద్వారా స్థానికులకు ఉపాధి లభించడంతోపాటు ప్రజలు ఆర్థిక అభ్యున్నతి సాధిస్తారని పరిశ్రమల ఏర్పాటుకు అంగీకారం తెలిపితే.. నేడు అవే పరిశ్రమలు నిబంధనలు ఉల్లంఘిస్తూ స్థానిక చెరువులను తమ రసాయన జలాలతో కాలుష్యం చేస్తూ ప్రకృతిని విధ్వంసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై వివిధ సందర్భాల్లో తీరు మార్చుకోవాలని పరిశ్రమల యాజమాన్యాలకు సైతం సూచించినప్పటికిని.. ఎలాంటి మార్పు కనిపించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. చెరువుల్లోకి కాలుష్య జలాలు వదలడం మూలంగా స్థానికంగా వ్యవసాయ రంగం పూర్తిగా విధ్వంసం కావడంతో పాటు పశుపక్షాదులు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయని తెలిపారు. మహిళలకు వివిధ రకాల క్యాన్సర్లు సోకి నరకయాతన అనుభవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలను వదిలివేసి వలసలు వెళ్లాల్సిన పరిస్థితిలు ఉత్పన్నమవు తున్నాయని తెలిపారు. ప్రజల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధమని.. అవసరమైతే కాలుష్య పరిశ్రమలను తరిమికొడతామని హెచ్చరించారు. కాలుష్యాన్ని అరికట్టాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాలుష్యాన్ని వెదజల్లుతున్న పరిశ్రమల పై ప్రజలు నేరుగా ఫిర్యాదులు ఇస్తున్నప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మీ నిర్లక్ష్యం.. చేతగానితనం మూలంగానే పరిశ్రమలు విచ్చలవిడిగా కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయని అన్నారు. అయ్యమ్మ చెరువు కాలుష్య సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. చెట్ల పోతారం నుండి కిష్టాయపల్లి, గండి చెరువు, కృష్ణారెడ్డిపేట చెరువు మీదుగా నక్క వాగు వరకు 6 ఫీట్ డయా పైపు లైన్ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. చెరువు పరిధిలో కట్టుదిట్టమైన ఫెన్సింగ్ నిర్మాణం చేసి పశువులు వెళ్లకుండా చర్యలు తీసుకోబోతున్నట్లు తెలిపారు. స్థానికంగా కాలుష్యాన్ని వెదజల్లుతున్న 14 పరిశ్రమలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేయబోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి అయ్యమ్మ చెరువులోని కాలుష్య జలాలను పూర్తిగా తొలగించనున్నట్లు తెలిపారు. ప్రజల ప్రాణాల కంటే విలువైనది ఏమీ లేదని.. ఇక నుండి పరిశ్రమలు అప్రమత్తంగా ఉండాలని.. కాలుష్య జలాలను వదిలితే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కాలుష్య జలాలను వదులుతున్న పరిశ్రమలు సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పిసిబి ఈఈ కుమార్ పాఠక్, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్,గడ్డపోతారం మున్సిపల్ చైర్మన్ సుష్మ గణేష్, వైస్ చైర్మన్ మహేందర్ గౌడ్, గడ్డపోతారం మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, సీఐ రవీందర్ రెడ్డి, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్, సీనియర్ నాయకులు బాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, నరసింహ, ప్రకాష్ చారి, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# నేరం చేస్తే శిక్ష తప్పదు

## జిల్లా ఎస్పీ అశోక్ కుమార్...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) ఏప్రిల్ 16.**

ఈ సంవత్సరం 20 కేసుల్లో నిందితులుగా ఉన్న 36 మందికి జైలు శిక్షలు. నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పిపి లను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేసిన ఎస్పీ కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు కేసులకు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన పీపీలు రామకృష్ణ రావు, ప్రణయ్,రాజేష్ లను అభినదించి శాలువతో సత్కరించి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ....నిందితులకు శిక్షపడుటలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కీలక పాత్రని , పోలీసు అధికారులు,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సమన్వయశీ తో నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు. ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదుపడేలా కృషి చేసి శిక్షల శాతం పెరిగేలా పని చేయటం అభినదనియని అన్నారు.పోలీస్ ఆదికారులు న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ నేరస్థులకు ఖచ్చితంగా శిక్ష పడేవిధంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. పోక్సో, హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని సూచించారు. గడిచిన రెండు నెలల్లో 20 కేసుల్లో నిందితులుగా ఉన్న 36 మందికి జైలు శిక్షలు కోర్ట్ ద్వారా విదించడం జరిగిందని తెలిపారు.



# 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా పట్టణ సభ కార్యక్రమం

**(కవ్వాల సురేందర్, ప్రజాతీర్పు, వేములవాడ) ఏప్రిల్ 16:**

వేములవాడ పట్టణంలో తేదీ 16-04-2026 రోజున 99 రోజుల ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం లో భాగంగా ఈ రోజు మహాలింగేశ్వర గార్డెన్ లో గౌరవ చైర్మన్ మరియు మున్సిపల్ కమిషనర్ గారి సమక్షం లో పట్టణ సభ కార్యక్రమము నిర్వహించడం జరిగింది .ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి చర్చించడం జరిగింది. గౌరవ చైర్ పర్సన్ శ్రీ పుల్కం రాజు గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న నూతన పథకాలు 1) అల్పాహారం (ప్రీ ప్రైమరీ నుండి ఇంటర్మీడియట్ వరకు 2) ఇందిర కుటుంబ జీవిత బీమా పథకం (రాష్ట్రంలోని కుటుంభాలన్నిటికీ జీవిత బీమా) 3) మధ్యాహ్న భోజనం పథకం ఇంటర్మీడియట్ విద్య వరకు పొడిగింపు) 4) పంటల వైవిధ్యకరణ , ప్రకృతి సేంద్రీయ వ్యవసాయం పథకాల గురించి వారు తెలిపారు. మరియు ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లు పేద ప్రజలకు చేరేలా కృషి చేస్తానని మరిన్ని కొత్త సంక్షేమ పథకాలు పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అని వారు తెలిపారు. గౌరవ శాసన సభ్యులు ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ గారి నాయకత్వములో 150 కోట్లతో శ్రీ రాజ రాజేశ్వర దేవస్థానం అభివృద్ధి పనులు, 46 కోట్లతో ప్రధాన రోడ్డు విస్తరణ పనులు, 4.20 కోట్లతో రూపాయలతో పట్టణములో రోడ్డు మరియు డ్రైనేజి పనులు మరియు పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాము అని చెప్పడం జరిగినది. ×జణూ ద్వారా పొన్నాల స్వామి గారికి వీల్ చైర్ ఇవ్వడం జరిగింది. మరియు అయ్యారు పల్లి, పార్వతి పురం అంగన్వాడీ కేంద్రాలో వాటర్ ప్యూరిఫైడ్ ఇవ్వడం జరిగినది. ఇట్టి కార్యక్రమం లో గౌరవ రెవెన్యూ డివిషన్ ఆఫీసర్ శ్రీమతి ఆర్.వి రాధా భాయ్ గారు, వేములవాడ పట్టణ సిఐ గారు, వైస్ చైర్మన్ నరాల శేఖర్ గారు, వార్డు కౌన్సిలర్లు, ఇందిరమ్మ కమిటి సభ్యులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.




# పిండిపోలు రామయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు

**టేకులపల్లి, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

టేకులపల్లి :స్వాతంత్ర సమరయోధులు, పిండిపోలు రామయ్య సేవా సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రంను విద్యుత్ శాఖ జిల్లా అధికారి ఎస్.ఈ జి మహేందర్ గురువారం ప్రారంభించినారు. అనంతరం వారు మాట్లాడుతూ..పిండిపోలు రామయ్య సేవా సంస్థను తన తండ్రి పేరు మీద గత 25 సంవత్సరాల నుండి బొమ్మనపల్లి ఏ ఈ అయిన పిండిపోలు బుజ్జి కన్నయ్య నడుపుతున్నారుఅని బొమ్మనపల్లి లో గ్రామంలో మూడవసారి చలివేంద్రమును ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరు ఎవరికి తోచిన సహాయం చేస్తూ పదిమందికి ఉపయోగపడలని ఈ వేసవికాలంలో బొమ్మనపల్లి సెంటర్ లో ఎప్పుడు రద్దీ ఉంటుంది ఎండాకాలం ప్రజల దాహాన్ని తీరుస్తున్న పిండిపోలు రామయ్య సేవా సంస్థ వారిని అభినందించినారు. మానవ సేవే మాధవసేవా అని అన్నారు. ఈ కార్యక్రమంలో జి రంగస్వామి,ఏ రఘురామయ్య, మధు,జలీల్,బొమ్మనపల్లి విద్యుత్ సిబ్బంది ఆయన అంగోత్ వెంకట్రాం, ఎండి నాగుల్ మీరా , బి .దేవ్ సింగ్ , ఎస్.కె యాకుబ్ పాషా, ఎస్.కె వసీం పాషా, డి.చరణ్ , బెంజ్ మెన్ , ప్రవర్ధన్ కుమార్ , బి లచ్చు , తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలి

## బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పం మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఏప్రిల్ 16**



వాహనదారులు రహదారి భద్రతా నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అరైవ్ అలైవ్ లో భాగంగా గురువారంవారం రోజున తాళ్ల గురజాల సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ఏ విధంగా దాటాలి, వాహనాలను ఏ విధంగా నడపాలి అదేవిధంగా హెల్మెట్ ఎలా వాడాలి వాటి ప్రాధాన్యతలను వివరించడం జరిగింది. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసిపి కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నిబంధనలను పాటించాలని, ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు. వాహనదారులు జాగ్రత్తగా వాహనాలను నడపాలని, రోడ్డు ప్రమాదం అంటే ఒక కుటుంబానికి జరిగే ప్రమాదమని తెలిపారు. రహదారులపై లైట్లు, బ్లైండ్ స్పాట్లను గుర్తించి తగు ఏర్పాట్ల చేయడం ప్రమాదం జరిగే ప్రాంతంలో సిగ్నల్ వ్యవస్థలను ఏర్పాటు చేసి వాహనాలను నియంత్రించడం జరుగుతుందని తెలిపారు. అనుభవానికి, ప్రమాదానికి సంబంధం లేదని, వాహనం నడిపి సమయంలో ఏకాగ్రతతో నడపాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు, వెనుక కూర్చునే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్ లో ప్రయాణించే ప్రతి ఒక్కరూ సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ప్రతి వాహనానికి సంబంధించి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, వాహనదారులు మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపకూడదని, రాంగ్ రూట్ లో వాహనం నడపకూడదని తెలిపారు. తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడం జరుగుతుందని, 18 సంవత్సరాల వయసు నిండని వారు వాహనాలు నడపకూడదని, ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యులై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు. రోడ్డు భద్రత నిబంధనలను కఠినంగా అమలు చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగా బ్రీత్ ఎనలైజర్స్, స్పీడ్ గన్స్ అవసరం మేరకు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వాహనం నడిపే సమయంలో మనం పాటించే చిన్న చిన్న విషయాలే మన ప్రాణాలను కాపాడతాయని తెలిపారు. రహదారి నియమ నిబంధనలతో పాటు హెల్మెట్ ప్రాముఖ్యతను ఇంటి వద్ద ఉన్న మీ కుటుంబ సభ్యులకు వాటిని ధరిస్తే ప్రమాదం నుండి ఎలా బయట పడుతారని వాటి ప్రాముఖ్యతను లైవ్ గా చేసి చూపించడం జరిగింది. అనంతరం తాళ్ల గురజాల రూరల్ పోలీస్ స్టేషన్ నుండి మోటార్ బైకు ర్యాలీ నిర్వహించి అనంతరం ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించకూడదని కచ్చితంగా కాకి యూనిఫామ్ ధరించడం తో పాటు ఆటోకు సైడ్ మిర్రర్ తప్పకుండా ఉండాలని తెలిపారు. అదేవిధంగా నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్ల గురజాల సర్కిల్ ఇన్స్పెక్టర్ హానోక్, బెల్లంపల్లి టూ టౌన్ ఎస్సై కిరణ్ కుమార్ తాల్లగురిజలా ఎస్సై రామకృష్ణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కుల గణనలో 'నేతకాని'కి అన్యాయం

- 15 లక్షల జనాభా ఉన్నా జాబితాలో చోటేది?
- సమగ్ర సర్వే చేపట్టి ప్రత్యేక రిజర్వేషన్లు ఇవ్వాలి
- సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్

**పెద్దపల్లి, ఏప్రిల్ 16 (ప్రజా తీర్పు):**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల సర్వే (సీబీసీ) నివేదికలో నేతకాని సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందని సమతా సైనిక దళ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 15 లక్షల జనాభా కలిగిన నేతకాని కులాన్ని ప్రధాన కులాల జాబితాలో ఎక్కడా ప్రస్తావించకపోవడం శోచనీయమని ఆయన పేర్కొన్నారు. బుధవారం విడుదలైన గణాంకాలను పరిశీలిస్తే.. తక్కువ జనాభా ఉన్న కులాలను కూడా విడివిడిగా చూపిన ప్రభుత్వం, నేతకాని వర్గాన్ని విస్మరించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభా 3.54 కోట్లుగా తేలినప్పటికీ, అందులో కీలకమైన సామాజిక వర్గాలను విస్మరించడం వల్ల భవిష్యత్తులో ఆయా వర్గాలకు అందాల్సిన సంక్షేమ పథకాలు, రాజకీయ ప్రాతినిధ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. 15 లక్షల జనాభా కలిగిన ఒక వర్గాన్ని గణాంకాల్లో చూపకపోవడం వారి అస్తిత్వాన్ని దెబ్బతీయడమేనని దుయ్యబట్టారు. నేతకాని సామాజిక వర్గంపై తక్షణమే సమగ్రమైన శాస్త్రీయ సర్వే నిర్వహించి వారి వాస్తవ జనాభా లెక్కలను బహిర్గతం చేయాలి.జనాభా ప్రాతిపదికన విద్య, ఉద్యోగాల్లో నేతకాని వర్గానికి ప్రత్యేక రిజర్వేషన్లు కేటాయించాలి. ప్రభుత్వం ప్రకటించే అభివృద్ధి ప్రణాళికల్లో ఈ వర్గానికి సముచిత స్థానం కల్పించాలనీ డిమాండ్ చేశారు?రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, జరిగిన పొరపాట్లను సవరించుకొని నేతకాని సామాజిక వర్గానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని డా. మార్షల్ దుర్గం నగేష్ హెచ్చరించారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు సమిష్టి కృషి అవసరం

**పెద్దపల్లి, ఏప్రిల్ 16 (ప్రజా తీర్పు):**

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. గురువారం ప్రజాపాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎంబీ గార్డెన్స్‌లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజాపాలన పేరిట పాలన కొనసాగుతోందన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, కొత్త రేషన్ కార్డుల జారీ, సన్న బియ్యం పంపిణీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత పింఛన్లు, గృహ జ్యోతి, రూ.500లకు గ్యాస్ సిలిండర్, ఇందిరా మహిళా శక్తి కింద వడ్డీ లేని రుణాలు వంటి పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక పేరిట 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రజల సూచనలతో పాలనను మరింత మెరుగుపరుస్తున్నామని అన్నారు. మున్సిపల్ వార్డుల్లో సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు.ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసిన ఆయన, ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం వంటి ప్రమాదకర అలవాట్లను నివారించాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగాన్ని తప్పనిసరి చేయాలని చెప్పారు.ప్రమాదాల సమయంలో గోల్డెన్ అవర్‌లోపు బాధితులను ఆసుపత్రికి తరలిస్తే 'రహ వీర్' పథకం కింద రూ.25 వేల ప్రోత్సాహకం అందిస్తామని తెలిపారు. అదేవిధంగా బాధితులకు సమీప ప్రైవేటు ఆసుపత్రుల్లో రూ.1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీపీ రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల వృద్ధిని అరికట్టాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పం మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) ఏప్రిల్ 16**



వ్యాధుల నియంత్రణలో భాగంగా దోమల వృద్ధిని అరికట్టాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసన కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ప్రభుత్వ ఆసుపత్రి పర్యవేక్షకులు డా.వేదవ్యాస్, టి-హబ్ ప్రతినిధి డా.శిల్ప లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 16 నుండి మే 15 వరకు జిల్లాలో వెక్టర్-బోర్న్ వ్యాధుల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని, దోమలు, టిక్స్, ఫ్లీలు ద్వారా వ్యాప్తి చెందే మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించి నివారించేందుకు వైద్య శాఖ ముందుండి చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లా, మండల స్థాయిలో పారిశుద్ధ్య కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సరిపడా నిధులు అందుబాటులో ఉన్నాయని, సరైన విధంగా వినియోగించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామాలు, పట్టణాలలో గుంతలు పూడ్చడం, మురుగు కాలువలు శుభ్రపరచడం, నిల్వ నీరు తొలగించడం వంటి పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని, సిబ్బంది తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కార్మికులను వినియోగించి పనులను కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థలు, సంక్షేమ వసతి గృహాలలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, నెలవారీ ప్రణాళికను అమలు చేయాలని తెలిపారు. జూన్ 12న విద్యా సంవత్సరం పునఃప్రారంభమయ్యే నేపథ్యంలో పాఠశాలలలో 2-3 రోజుల ముందు శుభ్రపరిచే పనులు పూర్తి చేయాలని, విద్యార్థులకు అందించే ఆహారం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని దోమల నివారణ చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా నిల్వ నీరు ఉండకుండా చర్యలు తీసుకోవాలని, జూన్ 5వ తేదీ నుండి 15వ తేదీ వరకు మరొక దశలో వైద్య శాఖ చర్యలు కొనసాగించాలని తెలిపారు. జిల్లాలో మందులు, ద్రావణాలు, పడకలు సమృద్ధిగా ఉన్నాయని, మండల స్థాయిలో సిబ్బంది రోగులకు తగిన సేవలు అందించాలని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాలలో నెల రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, కీటక దళిత వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టడం, దోమల వృద్ధిని అరికట్టడం, దోమల ద్వారా వచ్చే వ్యాధులను నియంత్రించడం కొరకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే పాఠశాలలలో దోమల మందు పిచికారి చేయాలని తెలిపారు. నివాసాలలో దోమతెరలు, ఇంటి కిటికీలకు జాలీలు వాడటం, ఇంటి ఆవరణలో, నీళ్ళకుండీలు, బావుల వద్ద పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. బోదకాలు నివారణకు జిల్లాలో సంవత్సరానికి ఒక మోతాదు డిఇసి మాత్రలు వాడడం వ్యాధిగ్రస్తులకు ఉపశమనం కలిగిస్తుందని, జిల్లాలో కీటక జనతా వ్యాధులు వ్యాపించకుండా చర్యలు చేపట్టడంలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని తెలంగాణ డయాగ్నొస్టిక్స్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జిల్లాలో వైద్య శిబిరమును ఏర్పాటు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించి తగు వైద్య చికిత్స అందించాలని తెలిపారు. వేసవి అయినందున వడదెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, తెలిపారు. మధ్యాహ్నము 12 గంటల నుండి 4 గంటల మధ్యలో ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉన్నందున ఆ సమయంలో ప్రజలు బయటకు రాకుండా ఉండేలా వివరించాలని, అన్ని గ్రామాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచడం జరిగినదని తెలిపారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు గొడుగు, తెల్లటి నూలు వదులు దుస్తులు ధరించాలని, తలపై టోపీ, రుమాలు ధరించాలని తెలిపారు. ఉదయం 11 గంటల లోపు సాయంత్రం 4 గంటల తర్వాత మాత్రమే ఆరు బయట పని చేసుకోవాలని. వడదెబ్బ తగిలిన వ్యక్తిని చల్లని గాలి ఉన్న నీడ ప్రదేశానికి చేర్చాలని, 108 ద్వారా ఆసుపత్రికి తరలించాలని తెలిపారు. విధులలో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం కార్యక్రమాల సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిపిఓ ప్రశాంతి, సబ్ యూనిట్ అధికారి సిహెచ్ వెంకటేశ్వర్లు, ఎం.టి.ఎస్. శ్రీనివాస్, కిరణ్, ఆర్ఎస్ పద్మ వసుమతి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

# వాహనదారులంతా కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలి

- ధర్మపురి సిఐ ఎ.రాం నర్సింహారెడ్డి
- ధర్మపురిలో డ్రైవర్లకు కంటి పరీక్షలు

**( ఎలుక భగవాన్, ప్రజాతీర్పు, ఎండపల్లి) ఏప్రిల్ 16:**



వాహన చోదకులంతా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకొని రోడ్డు ప్రమాదాలను నివారించడానికి కృషి చేయాలని ధర్మపురి సిఐ అలపాటి రాం నర్సింహారెడ్డి సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలనలో భాగంగా "ఎరైవ్-ఎలైవ్" రోడ్డు భద్రత కార్యక్రమంలో గురువారం ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో డ్రైవర్లకు కంటి పరీక్షలు చేయించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆటో డ్రైవర్లకు, కారు డ్రైవర్లకు, గూడ్స్ వాహనాల డ్రైవర్లందరికి ఆసుపత్రి కంటి వైద్య నిపుణుడు డా. తిరుపతి, ఆసుపత్రి సూపరింటెంట్ డా. రవి ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మపురి సీఐ రాం నర్సింహారెడ్డి మాట్లాడుతూ వాహనం నడిపే వ్యక్తులందరికీ కంటిచూపు ప్రధానమని, కంటి చూపు సమస్యల తో వాహనాలు నడిపితే వచ్చే అనర్థాల గురించి వివరించారు. కంటిచూపు సమస్య ఉన్న వ్యక్తి దానికి సంబంధించిన అద్దాలను ఉపయోగించాలని తద్వారా ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు. రాత్రి పూట వాహనాలు నడిపే వ్యక్తులకు కంటికి సంబంధించిన జాగ్రత్తలను వివరించారు. డ్రైవర్ల కంటి చూపు మీద వారి యొక్క జీవితంతో పాటు వాహనంలో ప్రయాణించే వ్యక్తుల జీవితాలు కూడా ఆధారపడి ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి ఎస్సై లు జి.మహేష్, ఎం. రవీందర్, ధర్మపురి ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్,పోలీస్ సిబ్బంది, పలువురు డ్రైవర్లు , పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు విద్య తో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

మల్లాపూర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అరుణ

**( ఎలుక భగవాన్ , ప్రజాతీర్పు ఎండపల్లి) ఏప్రిల్ 16:**

విద్యార్థులు విద్యను అభ్యసించడంతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని మల్లాపూర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ అరుణ పేర్కొన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ అరుణ ఇంటర్మీడియట్ వృత్తి విద్య కోర్సులో భాగంగా ఇంటర్న్ షిప్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అరుణ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు వృత్తిపరమైన నైపుణ్యాలు పెంపొందించుకున్నప్పుడే భవిష్యత్తులో స్థిరపడుతారని అన్నారు. మల్లాపూర్ గురుకుల విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభను గుర్తిస్తూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఒకేషనల్ ట్రైనర్స్ సుప్రజ, పుష్పలత లను అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## వన మహోత్సవానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

**గోదావరిఖని, ఏప్రిల్ 16, (ప్రజా తీర్పు):**

వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ అధికారులను ఆదేశించారు.గురువారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అటవీ శాఖ అధికారులతో సమన్వయంతో వార్డు అధికారులకు నిర్వహించిన శిక్షణా సమావేశంలో ఆమె మాట్లాడారు.వర్షాకాలం ప్రారంభంలోనే సుమారు 1,80,000 మొక్కలు నాటేలా డివిజన్ వారీ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. మొక్కలు నాటేందుకు అనువైన స్థలాలను గుర్తించడం, ఏ జాతి మొక్కలు ఎంత సంఖ్యలో నాటాలన్న అంశాలను ప్రణాళికలో సవివరంగా పొందుపరచాలని తెలిపారు.ఎవెన్యూ, బ్లాక్, హోమ్ స్టెడ్ ప్లాంటేషన్‌కు అనుగుణంగా అవసరమైన మొక్కలు, ఎరువులు, ట్రీ గార్డులను ముందుగానే సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ఎవెన్యూ ప్లాంటేషన్‌లో రహదారి వెడల్పు, విద్యుత్ తీగలు, పైప్‌లైన్లు వంటి అంశాలను పరిగణలోకి తీసుకుని తగిన మొక్కలు నాటాలని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జనగణన, ఇందిరమ్మ ఇళ్లు, పన్ను వసూళ్ల పురోగతి, పారిశుధ్య నిర్వహణపై కూడా సమీక్షించారు.ఈ సమావేశంలో నగర పాలక సంస్థ ఇంజినీర్ పి.వి. రామన్, డిప్యూటీ ఇంజినీర్ షాభాజ్, అసిస్టెంట్ ఇంజినీర్ తేజస్విని, అటవీ శాఖ సెక్షన్ అధికారి రహమతుల్లా, డీఆర్వో కొమురయ్య, బీట్ ఆఫీసర్ వరప్రసాద్ పాల్గొన్నారు.



## వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యత్వం ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

**టేకులపల్లి, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

ఇల్లందు :వేంనరేందర్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం తెలంగాణ భవన్ లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి వేం నరేందర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియచేసిన ఎమ్మెల్యేకోరం నూతనంగా తెలంగాణ రాష్ట్రం నుండి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి ని ఢిల్లీ లో జరిగిన రాజ్యసభ సభ్యత్వం ప్రమాణ స్వీకారోత్సవం లో పాల్గొని తెలంగాణ భవన్ లో వారినిమర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన ఎమ్మెల్యే కోరం కనకయ్య ఇ యొక్క కార్యక్రమం లో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు కొత్తపేట గంధంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ భుక్యా ప్రవీణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి, మరో ముగ్గురు పరిస్థితి విషమం

**భద్రాద్రి కొత్తగూడెం రూరల్, ఏప్రిల్ 16 (ప్రజా తీర్పు )**

అశ్వారావుపేట మండల కేంద్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఖమ్మం రోడ్లోని రైతు వేదిక వద్ద గురువారం ఉదయం లారీ ట్రాక్టర్ను ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సత్తుపల్లి వైపు నుంచి అశ్వారావుపేట వైపుకు వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న కెమిలాయిడ్స్ ఫ్యాక్టరీకి చెందిన ట్రాక్టర్ను ఢీ కొట్టింది. ఇదే ఘటనలో పక్కనే ఉన్న ఆటో కూడా బోల్తా పడింది. అశ్వారావుపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చిట్టూరి కృష్ణయ్య(52), ఉట్లపల్లికి చెందిన కొవ్వాసి నాగరాజు (42) లు అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన మడకం సంతోష్(18), గద్దల వెంకట్రావు (54), మడకం సోమరాజు (45), రమేష్(42)లను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమంగా ఉన్న మరో ముగ్గురుని మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.



## పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**సిద్దిపేట్ హుస్నాబాద్ ఏప్రిల్ 16 ( ప్రజాతీర్పు)**

రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా హుస్నాబాద్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని చేపట్టారు. గురువారం ఏసీపీ కార్యాలయంలో భద్రకాళి ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో ఏసీపీ సదానందం, సీఐ శ్రీను, ఎస్ఐ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా చేపట్టిన ఈ శిబిరంలో వాహనదారులు, ఆటో డ్రైవర్లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. అనుభవజ్ఞులైన నేత్ర వైద్య నిపుణులు అత్యాధునిక పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల అనంతరం దృష్టిలోపం ఉన్న వారికి పోలీసు అధికారులు ఉచితంగా కళ్లద్దాలను పంపిణీ చేశారు. డ్రైవింగ్ చేసే సమయంలో కంటి చూపు స్పష్టంగా ఉంటే ప్రమాదాలను ఎలా నివారించవచ్చు పోలీసులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడం, శారీరక ఫిట్ నెస్ తో పాటు కంటి చూపులు మెరుగుపరచడం ద్వారా ప్రమాదాల రేటును తగ్గించవచ్చు అనే ఇలాంటి కార్యక్రమాలను సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలి - జిల్లా కలెక్టర్ అంకిత్.

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 16,(ప్రజా తీర్పు )**

జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ ఒ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 40 ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమగ్రంగా సమీక్షించినట్లు తెలిపారు. ప్రతి కేసులో దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని, చార్జ్‌షీట్లు ఆలస్యం లేకుండా దాఖలు చేయాలని అధికారులకు సూచించారు. బాధితులకు చట్టపరమైన రక్షణతో పాటు ప్రభుత్వ పరంగా అందించే పరిహారం, పునరావాస సదుపాయాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అట్రాసిటీ కేసుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేసిన కలెక్టర్, సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి కేసుల పరిష్కారంలో వేగం తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే బాధితుల గోప్యత, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీ హక్కులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ మాట్లాడుతూ, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల నిర్వహణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి కేసును సున్నితంగా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్రీలత, జిల్లా అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, కమిటీ మెంబర్లు సామ్యా నాయక్ లకావత్ వెంకటేశ్వర్లు, లక్ష్మీ రాంబాయి, కోలూరి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## సారీ ఫంక్షన్ వేడుకలకి హాజరై చిన్నారులను ఆశీర్వదించిన, పాత్రికేయులు కూస సుదర్శన్

**చెన్నారావుపేట, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

మహబూబాబాద్ జిల్లా లో నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకలు చెన్నారావుపేట మండలం ఖాదర్ పేట గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉప్పుల సురేష్ సుమలత ల ప్రథమ ద్వితీయ పుత్రికలైనా శ్రీహిత, సంహిత లకు నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ వేడుకలు గురువారం మహబూబాబాద్ లోని కిరాణా వర్తక సంఘంలో ఘనంగా జరుగగా పాత్రికేయులు కూస సుదర్శన్, హాజరై చిన్నారులను నిండు మనసుతో అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ ఫంక్షన్ కార్యక్రమంలో వీరస్వామి, సత్యం, గూడ ఆదిరెడ్డి, గడ్డం సాయిలు బంధుమిత్రులు,తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అడ్డాగా.. హుజురాబాద్ మునిసిపల్ కార్యాలయం

- మునిసిపల్ అవినీతిని బట్టబయలు చేసిన ఏసీబీ దాడి
- ప్రజా సమస్యలను పట్టించుకోని మున్సిపాలిటీ

**హుజురాబాద్, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**




హుజురాబాద్ మునిసిపల్ కార్యాలయం అవినీతికి అడ్డగా మారింది. అందిన కాడికి దోచుకుంటున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. పట్టపగలు నడిరోడ్డుపై ఒక అసిస్టెంట్ ఇంజనీర్ రూ.50 వేలు లంచం తీసుకుని ఏసీబీకి పట్టుపడ్డాడు అంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. కొత్త పాలకవర్గం వచ్చినప్పటికీ అధికారులు సిబ్బంది పనితీరు మాత్రం మారడం లేదు. అసలు హుజూరాబాద్ లో మునిసిపాలిటీ ఉందా లేదా అనే అనుమానం కలుగుతుంది. మునిసిపాలిటీ ఎన్నికల్లో ఎక్కువమంది కౌన్సిలర్లు కొత్త వాళ్లే గెలిచారు. వారికి పరిపాలనపై అవగాహన కొరవడింది. దీంతో అధికారులు సిబ్బంది ఆడింది ఆట పాడింది పాటగా మారింది. ఓ ముఖ్యమైన పోస్టులో ఉన్న అసిస్టెంట్ ఇంజనీర్ సుధాకర్ రెడ్డి ఏకంగా రూ.50 వేలు లంచం తీసుకుంటుంటే ఉన్నతాధికారులు ఏం చేస్తున్నారు? పాలకవర్గం ఏం చేస్తోంది? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఇంకా ఆ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రొఫెషనరీ పీరియడ్ కూడా పూర్తికాలేదు. అనంతపురం కి చెందిన ఏ ఈ ఇక్కడ ఉద్యోగం పొంది.. నడిరోడ్డుపై వేలాది రూపాయలు లంచాలుగా వసూలు చేస్తుంటే.. తమకు తెలియదని ఉన్నతాధికారులు పేర్కొనడం విడ్డూరంగా ఉందని పనులు చెప్తున్నారు. అతను తీసుకునే లంచాల్లో ఇతర అధికారులు సిబ్బందికి కూడా వాటా ఉండవచ్చనే అనుమానాలు కూడా పలువురు వ్యక్తం చేస్తున్నారు. మునిసిపాలిటీలో డబ్బులు ఇవ్వనిదే ఏ పని కావడం లేదని తెలుస్తోంది. ముఖ్యంగా అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత కొరవడంతో పాటు.. గుత్తేదారుల వద్ద లక్షలాది రూపాయలు లంచాలుగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో పనులు మన్నికగా జరగకపోవడంతో పాటు చేసిన పనులు కూడా తొందరగానే డ్యామేజీ అవుతున్నాయి. ఇక ప్రభుత్వ కార్యక్రమాల అమలులోను మునిసిపాలిటీ నిర్లక్ష్యం చూపిస్తోంది. తూతూ మంత్రంగానే 90 రోజుల ప్రణాళికను నిర్వహించారు. పారిశుద్ధ్య పనులపై కూడా పర్యవేక్షణ కొరవడింది. రోజు వేకువజాము నుండి పారిశుద్ధ్య పనులను పారిశుద్ధ్య కార్మికులను పర్యవేక్షించాల్సిన కమిషనర్ ఏ ఒక్కరోజు ఇక్కడ కనిపించిన పాపాన పోలేదని పలువురు చెప్తున్నారు. మున్సిపాలిటీ నుండి రావలసిన ఇవ్వాల్సిన సర్టిఫికెట్లను కూడా సరైన సమయానికి ఇవ్వడం లేదని తెలుస్తోంది. ఇక మున్సిపాలిటీ నుండి దైనందిన ఖర్చులకోసం పెద్ద ఎత్తున నకిలీ బిల్లులు సృష్టించి డబ్బులు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. డీజిల్ బిల్లులు, వీధి దీపాల బిల్లులు ఇతర నిర్వహణ ఖర్చుల పేరిట లక్షలాది రూపాయలు దుర్వినియోగం అవుతున్నట్టు ప్రచారం జరుగుతుంది. ఇటీవల మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు ఇతర మున్సిపాలిటీలో 30 లక్షల వరకు ఖర్చుకాగా హుజురాబాద్లో మాత్రం 65 లక్షల రూపాయల లెక్క చూపెట్టినట్టు తెలుస్తోంది. ఎన్నికల ఖర్చుకు ఆడిట్ లేదన్న నిబంధనను ఆసరాగా చేసుకొని లక్షలాది రూపాయలు దొంగ బిల్లులు సృష్టించి దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. డబ్బులు ఇవ్వనిదే నూతన గృహాలకు అనుమతులు ఇవ్వడం లేదని, కాసులు ఇవ్వనిదే ఇక్కడ పనులు కావడం లేదని ప్రజలు లబోదిబోమంటున్నారు. మున్సిపల్ సుధాకర్ రెడ్డి పట్టపగలు నడిరోడ్డుపై 50వేల లంచం తీసుకుంటూ దొరికిన నేపథ్యంలో.. జిల్లా కలెక్టర్ హుజూరాబాద్ మునిసిపాలిటీ పై ప్రత్యేక నిఘా పెట్టి సరైన పాలన ప్రజలకు అందడంతో పాటు.. ప్రభుత్వ కార్యక్రమాలను సక్రమంగా అమలు చేసి అవినీతిని అరికట్టాల్సి ఉందని పలువురు కోరుతున్నారు.

## మున్నూరు కాపు రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శిగా అనంతుల రమేష్

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఏప్రిల్ 16**



మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా అనంతుల రమేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు సర్దార్ పుటం పురుషోత్తం రావు పటేల్ ఉత్తర్వులు జారీచేశారు.ఈ సందర్భంగా తన నియామకానికి కృషి చేసిన రాష్ట్ర మున్నూరు కాపు కుల బంధావులకు వేములవాడ ఎమ్మెల్యే విప్ ఆది శ్రీనివాస్, కేంద్ర మంత్రి ఎంపీ బండి సంజయ్ కుమార్, మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మున్నూరు కాపు తెలంగాణ సంఘం నియమ నిబంధనలకు, రాష్ట్ర కమిటీ ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తూ మున్నూరు కాపుల ఐక్యత సంక్షేమానికి పాటు పడుతూ సమాజంలోని బహుజన కులాలతో సఖ్యతగా ఉంటూ మున్నూరు కాపు సంఘం అభివృద్ధికి పాటుపడతానని అనంతుల రమేష్ వెల్లడించారు



# ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షల నిర్వహణ

**(కుమారస్వామి, ప్రజాతీర్పు జగిత్యాల రూరల్) ఏప్రిల్16**

జగిత్యాల జిల్లా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు గురువారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎస్సై నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఆటోలను తనిఖీ చేసి డ్రైవర్లకు కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లోని ఆటో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వనజ, ఎస్సై నవీన్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



# కేంద్ర మంత్రి బండి సంజయ్ ను కలిసిన ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం

## కరీంనగర్-జగిత్యాల జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని వినతి

**(వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఏప్రిల్ 16**

చొప్పదండి శాసనసభ్యులు, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యం కేంద్ర మంత్రితో మాట్లాడుతూ కరీంనగర్ - జగిత్యాల జాతీయ రహదారి (ఎన్ హెచ్ 563) విస్తరణ పనుల్లో జాప్యం జరుగుతోందని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రహదారి పనుల పురోగతిలో వేగం పెంచి, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఉత్తర తెలంగాణ జిల్లాలను కలిపే ఈ కీలకమైన జాతీయ రహదారి పూర్తయితే కరీంనగర్, జగిత్యాల ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారికి రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, వాణిజ్యం, వ్యవసాయ రంగాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్, సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పనులు వేగవంతం చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.



# ఘనంగా కిసాన్ నగర్ హిందూ సమ్మేళనం

**( వకుళాభరణం భానుప్రకాష్ ప్రజాతీర్పు బ్యూరో చీఫ్ కరీంనగర్) ఏప్రిల్ 16**

కరినగర్ కిసాన్ నగర్ బస్తీలో చత్రపతి శివాజీ హిందూ సమ్మేళన సమితి ఆధ్వర్యంలో గురువారం హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. గోపూజతో కార్యక్రమం అనంతరం హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సమ్మేళన కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరైన ఆర్ఎస్ఎస్ కరినగర్ విభాగ ప్రచార ప్రముఖ్ తడి గొప్పల శంకరయ్య మాట్లాడుతూ సమాజంలో కులాల పేరుతో పెరుగుతున్న విభజనతో హిందువులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. హిందూ సమాజం ఐక్యంగా ఉన్నప్పుడే దేశం , ధర్మం సుస్థిరంగా ఉంటుందన్నారు. ఐకమత్యశీ లేని కారణంగా నేడు ప్రపంచంలోని అనేక దేశాలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాయన్నారు. హిందువులు ఐక్యంగా, సంఘటితశక్తిగా మారాల్సిన ఆవశ్యకత ఉందని తెలిపారు. హిందూ ధర్మం ఎంతో గొప్పదని,. సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ప్రతి ఒక్కరు దేశభక్తి, జాతీయభావం పెంపొందించుకోవాలని సూచించారు. హిందూల ఐక్యతను బలోపేతం చేయడమే లక్ష్యంగా హిందూ సమ్మేళనాలు దేశవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు. సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆర్ఎస్ఎస్ పిలుపునిచ్చిన మేరకు హిందూ సమ్మేళనాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. ఆర్ఎస్ఎస్ వందేళ్లు దేశం, ధర్మం, సంస్కృతి , సాంప్రదాయాల పరిరక్షణ కోసం నిరంతరయంగా పని చేసిందన్నారు. నేడు శతాబ్ది ఉత్సవాలలో భాగంగా పంచ పరివర్దన్ కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిందన్నారు. సంఘం దేశహితం కోసం ఎల్లవేళలా పనిచేస్తూ ముందు కొనసాగుతుందన్నారు. రాష్ట్ర సేవికాసమితి ప్రాంత శారీరక్ ప్రముక్ లెక్కల రమ మాట్లాడుతూ హిందూ ధర్మం ఎంతో పురాతనమైనదని, హిందూ ధర్మం విశిష్టమైన చరిత్ర కలిగి ఉందన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరు నడుం బిగించాలన్నారు. సనాత ధర్మ పరిరక్షణ మనందరికీ శ్రీరామరక్ష లాంటిదన్నారు. అనంతరం. ముఖ్యఅతిథిగా హాజరైన మంగళంపల్లి శ్రీనివాస్ శర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సమ్మేళనము కార్యనిర్వహణ సమితి అధ్యక్షుడు పసుల మహిపాల్ ప్రధాన కార్యదర్శి , గాజుల కృష్ణ జన జాగరణ సమితి అధ్యక్షుడు ఎన్నం శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి మేంగని రాజయ్య ఉపాధ్యక్షులు ఉప కార్యదర్శులు బస్తీ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# స్వంత వాహనాలతో కాలువల పూడిక తీత





## కోట్ల నిధుల ఆదా

**గోదావరిఖని, ఏప్రిల్ 16 ,(ప్రజా తీర్పు) :**

నగర పాలక సంస్థ స్వంత వాహనాలతో కాలువల్లో పూడిక తీయిస్తూ కాంట్రాక్టుల పేరుతో జరిగే కోట్లాది రూపాయల వ్యయాన్ని నివారిస్తున్నామని నగర మేయర్ మహంకాళి స్వామి తెలిపారు. వార్డు సందర్శన కార్యక్రమంలో భాగంగా 40వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ కజంపురం జయప్రద రాజేందర్‌తో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం పూడిక తీత పనులకు భారీగా నిధులు కేటాయించినప్పటికీ పనులు పూర్తిస్థాయిలో జరగడం లేదని అన్నారు. ఈ పరిస్థితికి చెక్ పెట్టేందుకు నగర పాలక సంస్థ స్వంత వాహనాలు, పారిశుద్ధ్య సిబ్బందితో ప్రధాన కాలువల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పూడిక తొలగిస్తున్నామని తెలిపారు. పాలకవర్గ సభ్యులు, అధికారులు, సిబ్బంది కలిసి పనులను పర్యవేక్షిస్తూ వేగంగా పూర్తి చేయిస్తున్నామని చెప్పారు. ఉల్లిగడ్డల బజార్ ప్రాంతంలో డ్రెయిన్ ఆక్రమణలు, భవనాల నిర్మాణం వల్ల పూడిక తీతకు ఆటంకాలు ఎదురవుతున్నప్పటికీ ప్రత్యామ్నాయ మార్గాల్లో పనులు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. పూడిక తొలగించకపోతే వర్షాకాలంలో కాలువలు నిండిపడి మురుగు నీరు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాలువల పక్కన నివసించే ప్రజలు చెత్త వేయకుండా సహకరించాలని కోరారు. స్వచ్ఛ రామగుండంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇక 40వ డివిజన్ ఉల్లిగడ్డల బజార్‌లో రామన్ వారధి పరిసరాల్లో ఉన్న పెద్ద మురుగునీటి కాలువలో ఏళ్ల తరబడి పేరుకుపోయిన పూడికను యంత్రాల సహాయంతో తొలగించి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ పనులను మేయర్ స్వయంగా పర్యవేక్షించడంతో పాటు చెత్త తొలగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకటస్వామి, ఈఈ పి.వి. రామన్, టిపిఎస్ నవీన్, డీఈ అఫ్తాబ్, ఏఈ జమీల్, సానిటరీ ఇన్స్పెక్టర్ సంపత్, ఇతర అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రామగుండం ఆధ్వర్యంలో పాల్గొన్న వారికి అల్పాహారం ఏర్పాటు చేశారు.



# బార్ అసోసియేషన్ లో గెలిచిన వీరయ్యకు మరియు గొట్టే ప్రశాంత్ ఘన సన్మానం

## యాదవులను పట్టణ యాదవ్ సంగం

**సూర్యాపేట, ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**

హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ ఎన్నికలలో వైస్ ప్రెసిడెంట్ గా మరియు కోశాధికారిగా గెలుపొందిన జక్కుల వీరయ్య యాదవ్ మరియు గొట్టే ప్రశాంత్ యాదవులను పట్టణ యాదవ్ సంగం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించినారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, యాదవుల అభివృద్ధికి అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా ఉండి సహకరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో జక్కుల మల్లయ్య యాదవ, శంబయ, ఎల్లావుల రాములు, జాల గురవయ్య, సుంకరి శివరాం యాదవ్, జడ సత్యనారాయణ, జక్కుల నరేందర్, ఎల్లావుల రమేష్, జయరాం, కొరి వీరయ్య, జడ అంజి, బొల్లం వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటేశ్వర్లు, రమేష్ మోదాల, సైదులు, బట్ట సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం

**పాపన్నపేట/మెదక్ ,ఏప్రిల్16 ( ప్రజా తీర్పు ):**

గ్రామాల అభివృద్ధికి అధికారులు, నూతన సర్పంచులు సమన్వయంతో పనిచేయాలని, సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమని డీఎల్ పీ వో సురేష్ బాబు పేర్కొన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా మండల స్థాయి సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో విద్యుత్, నీటి సమస్యలు పరిష్కరించాలని సర్పంచులు అధికారులను కోరారు. అరైవ్ - అలైవ్ లో భాగంగా ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. గ్రామ ప్రథమ పౌరులైన సర్పంచులు గ్రామ ప్రజలకు ఈ విషయంపై అవగాహన కల్పించి, రోడ్డు ప్రమాదాలు తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న అటవీ, అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపట్టాలి - జిల్లా కలెక్టర్ అంకిత్

**భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 16,(ప్రజా తీర్పు )**



గురువారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో అటవీ శాఖ అధికారి కృష్ణ గౌడ్‌తో కలిసి అసైన్డ్ భూముల అంశంపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అసైన్డ్ భూములకు సంబంధించిన వివిధ సమస్యలను సమగ్రంగా పరిశీలించి, వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అసైన్డ్ భూములపై అక్రమ ఆక్రమణలను కఠినంగా అరికట్టాలని, ఎక్కడైనా అక్రమాలు గుర్తించిన వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూముల రికార్డులను సక్రమంగా నవీకరించి, పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు . సర్వే నెంబర్ వారీగా ప్రభుత్వ, అటవీ, అసైన్డ్ భూముల పూర్తి వివరాలను సేకరించి సమగ్ర నివేదికలను తక్షణమే అందజేయాలని సూచించారు. భూముల ప్రస్తుత స్థితి, ఎదురవుతున్న సమస్యలు, ఆక్రమణల వివరాలు వంటి అంశాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఆక్రమణకు గురైన భూములపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో మరే ఇతర ప్రభుత్వ భూమి కూడా ఆక్రమణకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అటవీ భూములు, అసైన్డ్ భూములకు సంబంధించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అసైన్డ్ భూములకు సంబంధించిన అన్ని అంశాలలో నిర్లక్ష్యం లేకుండా, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట,అదనపు కలెక్టర్ వేణుగోపాల్ రెవెన్యూ శాఖ అధికారులు, అటవీ శాఖ అధికారులు మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# కుల గణన సర్వే దేశానికి ఆదర్శం

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.16**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కీచ్చన్న గారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన సామాజిక, ఆర్థిక, కుటుంబ సర్వేపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. జనాభా దామాషా ప్రకారం బీసీ, ఎస్సీ, ఎస్టీలకు భవిష్యత్ లో రాజకీయ అవకాశాలు పెరుగుతాయని కేఎల్ఆర్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం చేసిన సర్వేను ఆదర్శంగా తీసుకుని దేశవ్యాప్తంగా చేపట్టాలని కోరారు. నిపుణుల కమిటీ చేసిన చేసిన సర్వే వివరాలు ప్రభుత్వ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచామని లక్ష్మారెడ్డి అన్నారు. అత్యధికంగా ఉన్న కులాలకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎక్కువ సీట్లు ఇస్తామని... ఇప్పటికే బలహీన వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని కిచ్చెన్నగారు తెలిపారు.

# రాజారాంపల్లి ఎస్ ఆర్ ఆర్ గార్డెన్స్ లో ఎండపల్లి ప్రజా పాలన మండల స్థాయి సమావేశం

**( ఎలుక భగవాన్, ప్రజా తీర్పు, ఎండపల్లి), ఏప్రిల్ 16**



: జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి ఎస్ ఆర్ ఆర్ గార్డెన్ లో ఎండపల్లి మండల స్థాయి 99 రోజుల ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సమావేశం మండల పరిషత్ అభివృద్ధి అధికారి దొండ కృపాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రజాపాలన ముఖ్య అతిథిగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎండపల్లి మండల ప్రత్యేక అధికారి రవి ప్రసాద్ పాల్గొన్నారు. కాగా ఈ సమావేశంలో ఆయా మండల స్థాయి అధికారులు తమ శాఖల అభివృద్ధి పనులను సమావేశంలో వెల్లడించారు. మండల తహసిల్దార్ ఎడ్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ భూ లబ్ది పొందుతున్న వారి వివరాలు, మండల లో చేయూత పెన్షన్ వృద్ధప్య 1817, వితంతువు 1204, వికలాంగులు 558, గౌడ 172, చేనేత 132, ఒంటరి మహిళ 127, బీడీ కార్మికులు 586, మొత్తం కలిపి 4596 పెన్షన్లు లబ్ధి పొందుతున్నారు. కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ 210 మంది లబ్ధిదారులకు అందజేశామని, కొత్త రేషన్ కార్డ్స్ మరియు కన్వర్షన్ మొత్తం కలిపి 3862 కుటుంబాలకు రేషన్ కార్డ్స్ మంజూరు అయ్యాయని. అలాగే ఇందిరమ్మ మహిళా శక్తి గ్రూపులకు ఇందిరమ్మ చీరలు 5926 చీరలను పంపిణీ చేశామని, అలాగే వడ్డీ లేని రుణాలు డాక్రా మహిళలకు 262 గ్రూపులకు వడ్డీ లేని రుణాలు అందించామని, తెలిపారు. మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ మాట్లాడుతూ మండల పరిధిలోని పాఠశాల విద్యార్థులకు అల్పాహారం, పాలు పథకం కింద ప్రతి పాఠశాలకు అందిస్తున్నామని తెలిపారు. హౌసింగ్ ఏఈ గౌతమి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు మండల పరిధిలో 476 ఇండ్లు మంజూరు అయ్యాయని ఒక్కో ఇంటికి 5 లక్షల చొప్పున 23 కోట్ల 80 లక్షల రూపాయలు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే వ్యవసాయ శాఖ ఏవో కమల్ల మహేష్ మాట్లాడుతూ రైతు బీమా పథకం కింద 41 మంది లబ్ధిదారులకు 5 లక్షల చొప్పున రైతు బీమా రూపాయలు 2 కోట్ల ఐదు లక్షల రూపాయలను లబ్ధిదారులకు అందించామని, రైతు భరోసా కింద 9809 మంది రైతులకు 8 కోట్ల 86 లక్షల 19 వేల 550 రూపాయలను అందించామని వివరించారు. అనంతరం మండల వైద్యాధికారి డా.పి.లవ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికీ మండల పరిధిలోని వివిధ రోగాలకు సంబంధించిన కొంతమందికి స్త్ర చికిత్సలు చేయించామని, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలను పెంచామని, అది అనుగుణంగా మా సిబ్బంది తీవ్రంగా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ ఏఈ బండి సమ్మయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు గృహ జ్యోతి పథకం కింద 200 లోపు యూనిట్లను 5379 మందికి ప్రతినెల 15 లక్షల 36,630 రూపాయలను జీరో బిల్లు కింద అందించామని తెలిపారు. అలాగే ఇండ్ల మీద కెళ్ళి వెళ్లే లైన్లు ఉన్నచో అట్టి వాటికి మంత్రి గారు ప్రత్యేక నిధి కింద కొంత నిధి సమకూర్చారని, వాటిని త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లకు మీటర్ల కొరకు రెండు వేల రూపాయలు డిడి కట్టినచో ఐదు నుండి పది పోర్లు ఒక కిలోమీటర్ వరకు లైన్లు వేస్తామని తెలిపారు. ఏపీఎం తులసి మాత మాట్లాడుతూ మండల పరిధిలో వడ్డీ లేని రుణాలు డాక్రా గ్రూపుల కు 26 గ్రూపులకు 31 కోట్ల 39 లక్షల 59 వేల రూపాయలను అందించామని తెలిపారు. ఐసి డిఎస్ సూపర్వైజర్ అండాలు మాట్లాడుతూ మండల పరిధిలోని కొత్త అంగన్వాడీ కేంద్రాలకు పౌష్టికాహారం కింద ప్రతి పిల్లలకు అందించామని వివరించారు. ఈ కార్యక్రమం లో ఎండపల్లి ఫ్యాక్స్ మాజీ చైర్మన్ లు మద్దుల గోపాల్ రెడ్డి, గూడ రాంరెడ్డి, వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి, మండల సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్ యాదవ్, వెల్గటూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఇంచార్జి చైర్మన్ గోల్ల తిరుపతి, ఏఎంసి డైరెక్టర్ లు,సర్పంచ్ లు జీరెడ్డి మహేందర్ రెడ్డి, తాటిపర్తి రాజవ్వ, గొల్లపెల్లి మల్లేష్ గౌడ్, మారం సునీత-జలంధర్ రెడ్డి, కందికట్ల అమృత-రాజేష్, బాలసాని శారద-మల్లేశం, ఆవుల మమత-తిరుపతి, సింగిరెడ్డి లింగారెడ్డి, కొంగల జగదీశ్వర్ రెడ్డి, గాదం భాస్కర్, కోడిపెల్లి కొమరమ్మ-శ్రీనివాస్, బెద్దల ప్రవీణ్ పడిదం లావణ్య-మొగిలి, దర్శనాల నరేష్, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, ఐకెపి సీసీలు, సిఏలు, వివోలు, మహిళలు వివిధ గ్రామాల నుండి వచ్చిన ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# జీరో యాక్సిడెంట్ జోన్‌గా. మెదక్ జిల్లా తయారు కావాలి కలెక్టర్

- కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం డ్రైవర్లకు కలెక్టర్ సూచన
- వాహన డ్రైవర్లకు ఏర్పాటుచేసిన కంటి వైద్య శిబిరాన్ని పరిశీలించిన కలెక్టర్

**మెదక్, ఏప్రిల్ 16 ( ప్రజా తీర్పు ):**



అతివేగం, డ్రింక్ అండ్ డ్రైవ్, ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం ప్రమాదాలకు సాంకేతాలు జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు వాహనదారులు బాధ్యతగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలి. ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ల పంపిణీ, సిగ్నేచర్ క్యాంపై నిర్వహణ వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ , జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు. జీరో యాక్సిడెంట్ జోన్ గా మెదక్ జిల్లాను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. 99 రోజుల ప్రగతి ప్రణాళికలో అరైవు-అలైవ్ కార్యక్రమంలో భాగంగా మెదక్ మండల కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ లో రోడ్డు ప్రమాదాల నివారణపై ద్విచక్ర వాహనదారులు, కారు డ్రైవింగ్ చేసేవారు హెల్మెట్ సీట్ బెల్ట్ ధరించడం పై పోలీస్-రవాణా శాఖ సంయుక్త ఆధ్వర్యంలోఅవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలోనే హార్ట్ ఎటాక్ గురైన వారికి సిపిఆర్ ద్వారా ప్రాణదానం చేయవచ్చు అనే నినాదంతో సర్జన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ప్రత్యక్షంగా విద్యార్థులకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లాలో జీరో యాక్సిడెంట్ జోన్ గా తీర్చిదిద్దాలని అన్నారు. పోలీస్ రవాణా శాఖ సమన్వయంతో నిర్వహించిన రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు హెల్మెట్ సీట్ బెల్ట్ పెట్టుకోవడం వల్ల జరిగే ప్రాణం నష్టాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా వివరించడం జరిగిందని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అందరం కృషిచేద్దామని అన్నారు.. మానవ తప్పిదాలవలనే ప్రమాదాలు అధిక సంఖ్యలో మన జిల్లాలో జరుగుతున్నాయని విలువైన నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయన్నారు అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు విధిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని, తద్వారా వారు ప్రజలకు ఆదర్శంగా నిలిచేలా కృషి చేయాలన్నారు. అలాగే, కాగా, రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాలలో తక్షణమే స్పందించి ప్రథమ చికిత్స ఎలా చేయాలి, క్షతగాత్రులను సత్వరమే సమీప ఆసుపత్రికి తరలించడం వంటి వాటి పై అవగాహన కల్పించాలన్నారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీడీవి శ్రీనివాసరావు మాట్లాడుతూ నివేదికల ప్రకారం, అతివేగం మరియు అజాగ్రత్త వల్ల తరచుగా మరణాలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, రోడ్డు భద్రతా చర్యలను కఠినతరం చేసి ట్రాఫిక్ ఉల్లంఘనలు చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవడమే పోలీస్ శాఖ ప్రధాన కర్తవ్యం గా ముందుకు పోతున్నామన్నారు. మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు మాట్లాడుతూ ప్రజల ప్రాణరక్షణ ధ్యేయంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు అంటే రోడ్డు ప్రమాదాలపై మనకు కనువిప్పు కలగాలన్నారు. హెల్మెట్ సీడ్ బెల్ట్ మన ప్రాణాలకు రక్షణ కవచంలా పనిచేస్తాయన్నారు. చిన్న నిర్లక్ష్యం వలనే ప్రమాదాలు అధికంగా జరుగుతాయన్నారు నేటి సమాజంలో యువత ఎక్కువగా ప్రమాదాలు బారిన పడుతున్నారని కుటుంబంలో కొడుకు ప్రమాదంలో చనిపోయినట్లయితే ఆ తల్లికి గర్భశోకం వెలకట్టలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ వాహనదారుడు కూడా నిబంధనలు తప్పనిసరి అన్నారు. ప్రయాణం ఎంత ముఖ్యమో గమ్యస్థానం చేరడం కూడా అంతే ముఖ్యం అని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణపై కవితల రూపంలో సభలో వినిపించారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రోడ్లపై బాధ్యతగా మెలగాలని రోడ్ల ప్రమాదాల పట్ల చైతన్యం పెంపొందించే విధంగా పోలీస్- రవాణా శాఖ సమన్వయంతో చేపడుతున్న ఈ కార్యక్రమం ప్రమాదాల నివారణ లక్ష్యంగా ముందుకు పోతుందన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ మాట్లాడుతూ మైనర్ లు వాహనాలు నడపకూడదని, డ్రంకెన్ డ్రైవ్, ఓవర్ స్పీడ్ వంటి వాటి గురించి విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ప్రతి ఒక్కరు బయటకు వెళ్లిన తర్వాత సురక్షితంగా ఇంటికి చేరుకోవడం అత్యంత ముఖ్యమని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్పీ సిగ్నేచర్ క్యాంపెయిన్ లో పాల్గొన్నారు. వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు వైద్య శిబిరాన్ని పరిశీలించారు. సురక్షిత ప్రయాణానికి కంటి చూపు ప్రధానం అని పోలీస్, రవాణా శాఖ సమన్వయంతో ఈ అరైవ్ - అలైవ్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున విజయవంతంగా కొనసాగుతూ, మంచిగా నిర్వహిస్తున్నారనిఅభినందించారు. వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని, వయసు పెరిగే కొద్దీ వచ్చే కంటి సమస్యలను గుర్తించి, ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకోవాలన్నారు. కంటి చూపు బాగా ఉంటేనే సురక్షిత ప్రయాణం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ వినియోగించుకోవాలని, ఈ కార్యక్రమంలో, జిల్లా వైద్య అధికారి శ్రీరామ్, జిల్లా ట్రాన్స్ పోర్ట్ అధికారి వెంకట స్వామి, డి ఎస్పీ ప్రసన్న కుమార్, మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక భూపతి రాజ్, వైస్ ఛైర్మన్ దొంతి నరేష్ గౌడ్, అధికారులు సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత

### మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**మెదక్, ఏప్రిల్ 16 (ప్రజా తీర్పు ):**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మెదక్ పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో "అరైవ్ అలైవ్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రతిమా సింగ్, జిల్లా ఎస్పీ శ్రీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భారతదేశంలో రోజుకు సగటున సుమారు 450 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండగా, గత సంవత్సరం దేశవ్యాప్తంగా సుమారు 1.7 లక్షల మంది ప్రాణాలు కోల్పోయి, మరో 3 లక్షల మంది గాయపడ్డారని తెలిపారు. మెదక్ జిల్లాలో గత సంవత్సరం 287 మంది మృతి చెందగా, 631 మంది గాయపడ్డారని వివరించారు. ఈ గణాంకాల ప్రకారం జిల్లాలో ప్రతి రోజు ఎక్కడో ఒకచోట ఒకరు రోడ్డు ప్రమాదానికి బలవుతున్నారని చెప్పారు. ఇవి కేవలం గణాంకాలు మాత్రమే కాకుండా, ప్రతి ప్రమాదం వెనుక ఒక కుటుంబం బాధ, కన్నీరు దాగి ఉందని అన్నారు. జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవేనని వెల్లడించారు. మైనర్లు వాహనాలు నడపకూడదని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తల్లిదండ్రులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కఠినంగా హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు రైడర్, పిలియన్ ఇద్దరూ ×ూ× ప్రమాణిత హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపకూడదని, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయరాదని, ఎడమ వైపు నుంచి ఓవర్టేక్ చేయకూడదని సూచించారు.

ఈ సందర్భంగా వైద్యుడు సీపీఆర్ (జూ=) ఎప్పుడు చేయాలి, ఎలా చేయాలి అనే అంశాలను ప్రదర్శనతో వివరించారు. అలాగే డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీరామ్, జిల్లా ట్రాన్స్‌పోర్ట్ అధికారి వెంకట స్వామి, డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, సందీప్ రెడ్డి, జార్జ్, మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' లో ప్రభుత్వ విజయాలను వివరించిన అదికారులు

**సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు గురించి వివిధ శాఖలు సాధించిన విజయాలను మండల స్థాయి అధికారులు వివరించారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని నేవూరి లక్ష్మి మల్లారెడ్డి ఏసీ ఫంక్షన్ హాల్ లో గురువారం ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్ అఫ్జల్ బేగం అధ్యక్షతన జరిగింది. మొదట సభను తెలంగాణ రాష్ట్ర గీతంతో ప్రారంభించారు. తర్వాత స్పెషల్ ఆఫీసర్ అఫ్జల్ బేగం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని సభలో చదివి వినిపించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా ఎల్లారెడ్డిపేట ఎస్సై రాహుల్ రెడ్డి సభలో అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ అఫ్జల్ బేగం మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లేలా తెలంగాణ ప్రభుత్వం పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కారం చేపట్టారన్నారు. పంటల మార్పిడి పద్ధతిని రైతులు పాటించి అధిక ఆదాయాలను పొందాలి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని రైతాంగం పంట మార్పిడి పద్ధతిని అవలంబించి అధిక లాభాలను పొందాలని ఆమె పిలుపునిచ్చారు. వరి పంటలో సన్నాళ్లనే పండించాలని మక్కా జొన్న సన్ఫవర్ వేరుశనగ పెసర భబ్బర చిరుధాన్యాల పంటలను ఫామ్ ఆయిల్ తోటలను పెంచాలని ఆమె కోరారు. గతంలో పేదలు తినే అంబలి మక్కా జొన్న ఘట్కలను నేడు రెస్టారెంట్లలో పెద్దపెద్ద ఏసి హోటళ్లలో తినే రోజులు వచ్చినాయని ఆమే గుర్తు చేశారు. సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ మండలంలో ఎంతోమంది ఇల్లు లేని నిరుపేదలు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకొని ఎంతో సంబరంగా గృహప్రవేశాలు చేసుకుంటున్నారని వాళ్ళ ముఖాలలో ఆనందం సంతోషం వ్యక్తం అవుతుంది అంటే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి నిదర్శనం అన్నారు. మండలంలో కొందరు ఇందిరమ్మ ఇళ్ళను నిర్మించుకోకపోవడం వల్ల వాటిని అధికారులు క్యాన్సల్ చేశారని వాటిని అదే గ్రామానికి మళ్లీ మంజూరు. చేయడం జరిగుతుందని వాటిని త్వరితగతిన లబ్ధిదారులు పూర్తిచేసుకుని గృహప్రవేశాలు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చిన్న భిన్నంగా ఉన్నప్పటికీ రేవంత్ రెడ్డి సర్కార్ ఒకవైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమ పథకాలను చేపడుతుందని అటువంటి ప్రభుత్వానికి ప్రజలు ఆశీర్వదించి అండగా ఉండాలని అల్మాస్ పురం సర్పంచ్ వెంకట్ రెడ్డి హరిదాస్ నగర్ సర్పంచ్ సిరం నాగరాజు యాదవ్ లు కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ షేక్ సబేరా బేగం , తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో సత్తయ్య మండల స్థాయి అధికారులు వివిధ గ్రామాల సర్పంచులు ఉపసర్పంచులు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు వివిధ గ్రామాల అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్లు ఆయా గ్రామాల మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వివిధ శాఖల అధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లు, ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయగా సభలో పాల్గొన్న వారందరూ తిలకించారు. స్క్రీన్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని సభలో ప్రదర్శించడం లో విఫలమయ్యారు.

## బైరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో చౌకధరల దుకాణం ప్రారంభం

**(వై యాదగిరి ప్రజాతీర్పు మహేశ్వరం రిపోర్టర్) ఏప్రిల్.16**



కీసర సర్కిల్, జవహర్ నగర్ జిహెచ్ఎంసి పరిధిలోని డబుల్ బెడ్‌రూమ్ ప్రాంతంలో గౌరవ మండల తహశీల్దార్ బైరెడ్డి రాజేష్ ఆధ్వర్యంలో నూతన చౌకధరల దుకాణం ప్రారంభించబడింది. ఈ కార్యక్రమానికి మండల ఆర్ఐ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మల్లేపూల శ్రీకాంత్, జవహర్ నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస గుప్త, జిల్లా చౌకధరల దుకాణం అధ్యక్షులు బల్లి శ్రీనివాస గుప్త, జవహర్ నగర్ చౌకధరల దుకాణం అధ్యక్షులు నంగునూరి పద్మావతి అశోక్ గుప్త, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కన్నమైన రాజు యాదవ్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, యువజన ప్రతినిధులు, చౌకధరల దుకాణం డీలర్లు మరియు బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కొత్తగా ప్రారంభమైన ఈ చౌకధరల దుకాణం ద్వారా స్థానిక ప్రజలకు అవసరమైన సరుకులు సులభంగా అందుబాటులోకి రానున్నాయి.

## క్రీడలు సాధారణం ప్రతిభ అసాధారణం

**కూకట్పల్లి, ఏప్రిల్ 16(ప్రజా తీర్పు)**



యువత క్రీడా రంగంలో తమ ప్రతిభను చాటుటకు విల్సన్ ఆధ్వర్యంలో అడ్డగుట్ట సొసైటీ జె ఎన్ టి యూ దగ్గర నైన్ కె స్పోర్ట్స్ క్లబ్ ద్వారా క్రీడారంగానికి మరిన్ని మెలుకువలతో యువతకి దగ్గర కావడానికి నైన్ కె స్పోర్ట్స్ క్లబ్ ను ప్రారంభి ంచడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్ ప్రారంభించడం జరిగినది .

# అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

### హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి

**చిగురుమామిడి ఏప్రిల్ 16 (ప్రజాతీర్పు)**



అధికారులు బాధ్యతగా విధులు నిర్వహించినపుడే జిల్లాలో చిగురుమామిడి మండలం అభివృద్ధిలో ముందుకు వెళుతుందని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. గురువారం చిగురుమామిడి మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలోని రైతు వేదికలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక మండల స్థాయి సమావేశాన్ని ఎంపిడిఓ విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన జిల్లా పంచాయతీ రాజ్ శాఖ అధికారి జగదీశ్వర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు చేసుకునే ప్రతి ఒకరికి పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో జయప్రద మాట్లాడుతూ మండలంలోని ముడిమాణిక్యం, రామంచ, ఇందుర్తి, చిన్న ముల్కనూరు, సుందరగిరి, లంబాడీపల్లె తదితర గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అవసరాల దృష్ట్యా మూత్రశాలలు, మధ్యాహ్న భోజన వంటగదులు, తాగునీటి ట్యాంకులు, పాఠశాలల ప్రహరీ గోడల నిర్మాణాలు వంటి మొదలగునవి పెండింగులో ఉన్నాయని, వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడానికి గ్రామాల సర్పంచులు పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఉద్యాన శాఖ అధికారిని మాట్లాడుతూ రైతుల ఆదాయం పెంపొందించాలంటే ఉద్యాన పంటలను ప్రోత్సహించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తుందని రైతులు అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణలో రాయితీలు అందిస్తుందని తెలిపారు. చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీ తరపున అధికారిని మాట్లాడుతూ చిన్న పిల్లలకు ఆపద ఉందని సమాచారం అందిస్తే వెంటనే స్పందిస్తామన్నారు. 0 నుండి 18 సంవత్సరాల పిల్లలకు ఆపదలు సంభవిస్తే టోల్ ఫ్రీ నంబర్ 1098కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. మత్తు పదార్థాలకు పిల్లలు దూరం ఉండేలా నిరంతరం జిల్లాలలో టీం గమనిస్తూ పనిచేస్తుందన్నారు. పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తూ మంచి దారిలో తీసుకెళ్లే దారిలో టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ నుండి నెలకు 4000 రూపాయల ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. మండలంలో ఇప్పటివరకు 9 మందికి అందించామన్నారు. మండలంలో 1876 రేషన్ కార్డులు, మొదటి దశలో 341

ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయని నూతన పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ నిధులు వివిధ దశల్లో 5 కోట్ల 59 లక్షలు మంజూరు అయ్యాయని రెవెన్యూ ఇన్స్పెక్టర్ నాగరాజు తెలిపారు. సఖీ అవగాహన కేంద్రం ప్రతినిధి మాట్లాడుతూ జిల్లాలో సఖీ కేంద్రం ఉంటుందని తెలిపారు. సఖీ కేంద్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతుందని తెలిపారు. 2025 సంవత్సరంలో 24 కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. మిషన్ భగీరథ నీటి పారుదల శాఖ అధికారిని మాట్లాడుతూ మండలంలో మిషన్ భగీరథ పైపులైన్ సమస్యలు ఎక్కడ వచ్చినా పరిష్కరిస్తున్నామన్నారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ మాట్లాడుతూ మండలంలో 39 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. 2 కేంద్రాలలో అంగన్వాడీ టీచర్లు ఖాళీలు ఉన్నాయి తెలిపారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా 20 వేల రూపాయలు ఆర్థిక సాయం పథకం ద్వారా అందిస్తున్నామన్నారు. అధికారులు స్పందించడం లేదు.. ఈ సందర్భంగా సర్పంచులు పలు ప్రజా సమస్యలు లేవనెత్తుతూ అసహనంవ్యక్తం చేశారు. చిన్న ముల్కనూరు సర్పంచ్ సాంబారీ విజయ రెవెన్యూ అధికారుల తీరుపై మండిపడ్డారు. గ్రామంలోమహిళా సంఘం వివో భవనం నిర్మాణానికి రెవెన్యూ అధికారులు అడ్డుపడుతున్నారని తెలుపగా ఆర్ఐ నాగరాజు స్పందిస్తూ సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చిన వెంటనే వాటి నిర్మాణానికి ఆదేశాలిస్తారని తెలిపారు. లంబాడీపల్లె సర్పంచ్ సంపత్ రెడ్డి మాట్లాడుతూ పలు సమస్యలు లేవనెత్తారు. ప్రజా పాలనలో దరఖాస్తులు చేసుకున్నప్పటికీ గ్రామాల ప్రజలను అధికారులు కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్నారు. విద్యుత్ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు పరిష్కరించే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. లంబాడీపల్లెలో పది సంవత్సరాల నుండి అంగన్వాడీ టీచర్, ఆయాను కేటాయించలేదన్నారు. పాఠశాలలో పనులు జరగక పోయినా జరుగుతున్నట్లు రికార్డులు రాస్తున్నారన్నారు. మిషన్ భగీరథ నీళ్లు జనాభా ప్రాతిపదికన రావడం లేదని తెలిపారు. వివిధ గ్రామాల సర్పంచ్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రోడ్డు భద్రత అలైవ్ అరైవు కార్యక్రమాన్ని పోలీసు శాఖ అధికారులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. మండలంలో పోలీసు అధికారులు రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ మత్తు పదార్థాల నివారణపై యువతకు అవగాహన కల్పించడం లేదన్నారు. ఒగులాపూరు సర్పంచ్ మాట్లాడుతూ తమ గ్రామ రైతులు వ్యవసాయ భూములు కోల్పోయారని తెలిపారు. రైతులకు వ్యవసాయ, రెవెన్యూ సమస్యల పరిష్కారం చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇక సర్పంచ్ ల ఫోరం అధ్యక్షుడు కొండాపూర్ సర్పంచ్ మార్క రాజు కొత్తపల్లి- హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులలో వ్యవసాయ బావులు, పైపు లైన్లు కోల్పోతున్న రైతులకు పరిష్కారం చూపాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. మండలంలోని మీసేవ కేంద్రాలకు చెందిన యజమానులు నిబంధనలకు విరుద్ధంగా దరఖాస్తులు చేసుకున్న ప్రజల నుంచి అధికంగా దరఖాస్తు రుసుం వసూల్ చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న మీ సేవా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు సమస్యలపై సర్పంచులు ప్రజా ప్రతినిధులకు సమస్యల వివరణలను నివృత్తి చేశారు. మండల అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సర్పంచులు పాల్గొన్నారు.

## మున్నూరుకాపు యువత మంథని నియోజకవర్గం ఇంచార్జీగా రౌతు నరేష్ పటేల్ నియామకం

**మంథని, ఏప్రిల్16 (ప్రజా తీర్పు)**



మంథని మండలం సూరయ్యపల్లి గ్రామానికి చెందిన రౌతు నరేష్ పటేల్‌ను మున్నూరుకాపు యువత మంథని నియోజకవర్గం ఇంచార్జీ గా నియమించారు. ఈ మేరకు మున్నూరుకాపు యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్ నియామక పత్రాన్ని జారీ చేశారు. మంథని నియోజకవర్గంలో మున్నూరుకాపు యువతను సంఘటితం చేయడం, యువతలో సామాజిక చైతన్యం పెంపొందించడం, సమాజ అభివృద్ధికి దోహదపడే కార్యక్రమాలను నిర్వహించడం లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు సంఘం వర్గాలు పేర్కొన్నాయి. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతో పాటు, వివిధ సామాజిక సమస్యల పరిష్కారానికి ముందుండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రౌతు నరేష్ పటేల్ గతంలో కూడా పలు సామాజిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సేవలు అందించారు. గ్రామస్థాయిలో యువతను సంఘటితం చేయడం, అభివృద్ధి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం వంటి అంశాల్లో ఆయన పాత్ర ఉండటం వల్లే ఈ బాధ్యతలను అప్పగించినట్లు సమాచారం. ఈ నియామకంతో మంథని నియోజకవర్గంలో మున్నూరుకాపు యువత కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయని, గ్రామ, మండల స్థాయిలో యువత భాగస్వామ్యం పెరుగుతుందని సంఘం ఆశాభావం వ్యక్తం చేసింది. సమాజ హితాన్ని దృష్టిలో ఉంచుకుని వివిధ కార్యక్రమాలు చేపట్టాలని కొత్త ఇంచార్జీ కి సూచించారు.

Edited Printed Published and Owned by SOYINENI MAHESH, **RNI Reg no. APTEL/2001/5268** printed at m/s Ganesh Printers Ramantapur Hyderabad, Published at m/s Bavani Publication Trust
Plot No C-1/2c idl Uppal hydrabad-500039 Chieff Editor : S.Mahesh, 94946 59622, office : 8309979541, Admn office: 1-7-334 2nd floor Musherabad Hydrabad -500020